విద్యాసంస్థలకు రెండ్రోజులు సెలవులు



పుట్టపర్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రెండు రోజులపాటు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం తెలిపారు. బుధ, గురు వారాల్లో పాఠశాలలకు సెలవు అని, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

పశువైద్యం.. మిథ్య...!



తీవ్రంగా వైద్యులు, సిబ్బంది కొరత

నాలుగు పశువైద్యశాలలకు ఒకే డాక్టర్



శిథిలావస్థలో పలు ఆస్పత్రులు

మూగజీవాలకు అందని వైద్యసేవలు

> బుక్కపట్నం పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్ నాలుగు ఆస్పత్రులకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. బుక్కపట్నం మండలంలోని క్రిష్ణాపురం, మారాల, పాముదుర్తి, కొత్తచెరువు మండలంలోని ఆస్పత్రులకు ఆయన ఒక్కరే వైద్యుడు. ఆయన ఏరోజు ఏ ఆస్పత్రిలో విధులు నిర్వహించాలో అర్థం కాని పరిస్థితి. పశువైద్యశాఖలో ఖాళీలకు ఇది నిదర్శనం. వైద్యులతోపాటు సిబ్బంది పరిస్థితి కూడా ఇలానే ఉంది.



కొత్తచెరువులోని పశువైద్యశాల

కొత్తచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం గిట్టుబాటు కాని రైతులు అనుబంధ రంగమైన పాడి పరిశ్రమను ఆశ్రయిస్తున్నారు. జీవనాధారమైన పాడిపశువులను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. వాటికి జబ్బు సోకితే వైద్యం అందించడానికి పశువైద్యాధికారి మాత్రం లేడు. దీంతో వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఏటా వర్షాకాలంలో పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఇతర జీవాలు వ్యాధుల బారిన పడుతున్నాయి. పశువైద్యులు, తగినంత సిబ్బందిలేక మూగజీవాలకు సకాలంలో వైద్యసేవలు అందట్లేదు. అత్యవసర పరిస్థితుల్లో కిందిస్థాయి సిబ్బందే (గోపాల మిత్రలు) తెలిసీతెలియని వైద్యం చేస్తున్నారు.

పశుసంపద, వైద్యశాలల వివరాలివీ..

జిల్లాలో పశువులు 2.64 లక్షలు, గేదెలు 95 వేలు, గొర్రెలు 27 లక్షలు, మేకలు 4 లక్షలు, కోళ్లు 14 లక్షలు ఉన్నాయి. ప్రాంతీయ పశువైద్యశాలలు 15, పశువైద్యకేంద్రాలు 66, గ్రామీణ పశువైద్య కేంద్రాలు 23, రైతుసేవాకేంద్రాలు 335 ఉన్నాయని జిల్లా పశువైద్యాధి శుభదాస్ తెలిపారు.

క్షేత్రస్థాయిలో అందని సేవలు

జిల్లాలో పశువైద్య సిబ్బంది కొరతతో పాడి పశువులకు వైద్యసేవలు అందట్లేదని రైతులు వాపోతున్నారు. తలుపుల, పెద్దన్నవారిపల్లి,నంబులపూలకుంట, అమడగూరు, తనకల్లు మండలంలోని కోటూరుపల్లి పశువైశాలలకు సొంత భవనాల్లేవు. కాలంచెల్లిన, అద్దె భవనాల్లో సిబ్బంది విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. వీటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించి, వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసి, మూగజీవాలకు వైద్యసేవలు అందేలా చూడాలని పాడిరైతులు కోరుతున్నారు.

34 పోస్టులు ఖాళీ

జిల్లాలో 104 పశువైద్యశాలలున్నాయి. వీటిలో 15 ప్రాంతీయ, 66 ప్రాథమిక, 23 ఉపకేంద్రాలున్నాయి. వీటిలో పశువులకు వివిధ రకాల వైద్యసేవలు అందించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.



మూడు రకాల పశు వైద్యశాలల్లో 305 మంది సిబ్బంది ఉండాలి. 165 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 131 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎక్కువగా ప్రాథమిక ఉప కేంద్రాల్లో 49 వెటర్నరీ అసిస్టెంట్లు, 56 ఆఫీస్ సబార్డినేట్లు లేరు. 34 వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయని పశువైద్య శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో పశు వైద్యసిబ్బంది ఖాళీలు, శిథిలావ్యవస్థలో ఉన్న భవనాల వివరాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

-శుభదాస్,
జిల్లా పశువైద్యాధికారి



వర్షానికి దెబ్బతిన్న మిరప పంట

> ఎండుమిర్చి పంట అన్నదాతకు నష్టాలఘాటు పంచింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పక్వానికి వచ్చిన కాయలు రాలిపోయి, దిగుబడి దారుణంగా పడిపోయింది. కాయల నాణ్యత కూడా తగ్గుతోంది. ధరలు కూడా నేలచూపులు చూస్తున్నాయి. వెరసి నష్టాల పంట పండుతోంది. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కవని అన్నదాతలు వాపోతున్నారు.

(మడకశిర - ఆంధ్రజ్యోతి)

నష్టాల ఘాటు..!

- కాయలు రాలిపోయి తగ్గిన దిగుబడి..
- నేలచూపులు చూస్తున్న ధరలు
- పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి
- సర్వం నష్టపోతున్న అన్నదాతలు



వర్షాలకు దెబ్బతిన్న ఎండుమిర్చి పంట



పెట్టుబడులు కూడా దక్కట్లేదు

బోరుబావి లేకపోవడంతో సమీప పొలం రైతు బోరు నుంచి నీరు తీసుకుని, అరెకరాలో పంట సాగు చేశా. రూ.40 వేలదాకా ఖర్చు వచ్చింది. గతేడాది కన్నా ఈసారి కూలి రేట్లు, సాగు ఖర్చులు పెరిగాయి. మార్కెట్‌లో మిరపకాయలు క్వింటాం ధర రూ.13 వేలలోపే పలుకుతోంది. వర్షానికి మిరప కాయలు రంగు మారడంతో ధర కూడా తక్కువగా దక్కుతోంది. నష్టాలు తప్పట్లేదు.

- హనుమంతరాయప్ప, కసాపురం

1200 ఎకరాల్లో సాగు

గత ఖరీఫ్‌లో ఎండుమిర్చి ధరలు విపరీతంగా ఉండడంతో రైతులకు లాభాల పంట పండింది. దీంతో ప్రస్తుం నియోజకవర్గ వ్యాప్తంగా బోరుబావుల కింద పెద్దఎత్తున పంట సాగుచేశారు. పంట పక్వానికి వచ్చింది. ఇటీవలిగా కురుస్తున్న వర్షాలు.. పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వర్షానికి మిరప మొక్కల వేళ్ల కుళ్లిపోయి, కాయలు రాలిపోతున్నాయి. ఫలితంగా పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని రైతన్నలు అంటున్నారు. మిరపకాయలు రంగు మారి, మార్కెట్‌లో ధర కూడా తక్కువగా దక్కుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా 1200 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. మడకశిర మండలంలో 335 ఎకరాలు, అగళి 180, రొళ్ల 90, అమరాపురం 420, గుడిబండ పరిధిలో 410 ఎకరాల్లో పంట పెట్టారు. ఎకరాలో పంట సాగుకు రూ.50 వేలదాకా ఖర్చవుతుంది.



ప్రస్తుతం వర్షానికి పంట దెబ్బతినడం, ధరలు లేకపోవడంతో పెట్టిన ఖర్చులు కూడా చేతికందవని రైతులు వాపోతున్నారు. స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో హిందూపురం, కర్ణాటకలోని శిర తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తే రవాణా ఖర్చులైనా మిగులుతాయంటున్నారు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించి, గిట్టుబాటు ధర కల్పించాలని రైతన్నలు.. ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



దిగుబడి లేదు.. ధర లేదు..

వర్షం కారణంగా మిరప కాయల రంగు మారాయి. వాటికి మార్కెట్‌లో ధర కూడా తక్కువగా దక్కుతోంది. క్వింటాం రూ.13 వేలలోపే పలుకుతోంది. వర్షానికి పంట దెబ్బతిని ఎకరాకి క్వింటాం దిగుబడి రావట్లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ దిగుబడిని విక్రయిస్తే 13వేలలోపే వస్తోంది. ఈలెక్కన దాదాపు రూ.37వరకు నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు.



రోడ్డు పక్కన ఎండబెట్టిన మిరప కాయలు, ధర, దిగుబడి లేక స్థానిక వ్యాపారులకే అమ్మేస్తున్న రైతు

ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు



- కలెక్టర్ చేతన్ ఆదేశాలు

పుట్టపర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న రెండ్రోజుల్లో భారీవర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచన నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వంకలు, వాగులు, కాలువలు, నదుల గట్లను పరిశీలించాలని ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూంలలో 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, పశువులను ఎగువప్రాంతాలకు తరలించాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం 08555-289039 నంబరుకు అత్యవసర సమాచారం అందించవచ్చన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



హిందూపురం, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 15: చిలమత్తూరు మండలంలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మంగళవారం ప్రకటనలో కోరారు. వలస కార్మికులపై అఘాయిత్యానికి పాల్పడటం బాధాకరమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నేరానికి పాల్పడిన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరతానన్నారు. చెడు ఆలోచనలతో మహిళలను చూడటానికి కూడా భయపడేలా చర్యలు ఉండాలన్నారు. నియోజకవర్గంతోపాటు జిల్లాలో ఇలాంటి నేరాలను అరికట్టడానికి పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. హిందూపురం నియోజకవర్గంలో మహిళలకు పూర్తి భద్రత కల్పించే బాధ్యత తమదేనన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదనీ, అందుకు తగ్గట్టు చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నియంత్రణకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నా పూర్తిగా సహకరిస్తామన్నారు. బాధిత మహిళలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రభుతం కూడా బాధిత కుటంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితులను వెంటనే పట్టుకోవడంలో చొరవ చూపిన జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులను అభినందించారు. పరారీలో ఉన్న మరో నిందితుడిని కూడా పట్టుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బొరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము తేది. 23.10.2024 నాడు వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
KDIRIPJ2404200001	HABEEBULLAH KHAN	KDIRIPJ2404180004	RAMA KRISHNA
KDIRIPJ2401030002	PARVATHAMMA	KDIRIPJ2404120006	RANGANE RAMACHANDRA
KDIRIPJ2404250001	RAMAKRISHNA V	KDIRIPJ2404240002	KUTAGULLA VINOD KUMAR
KDIRIPJ2404300001	BABU S		

క్రింద ఉదహరించిన చిరునామా వద్ద వేలం వేయడం జరుగుతుంది: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, D.NO 1/1093-99, 1ST FLOOR ,OPP GIRLS GIRLS COLLEGE,BYPASS ROAD,KADIRI -515591, వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ N CHENGAL REDDYను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 15.10.2024
స్థలం : అనంతపురం

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

గ్యాంగ్‌రేప్ కేసులో ఐదుగురి అరెస్టు

పరారీలో మరో కరుడుగట్టిన నేరస్థుడు

పట్టుబడిన వారిలో ఇద్దరు పాత నేరస్థులు, ముగ్గురు మైనర్లు

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అత్త, కోడలిపై సామూహిక అత్యాచారం చేసిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. హిందూపురం డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న మిల్లులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కుటుంబంలో అత్తాకోడలిపై ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి ఆరుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఆమె తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దుండగులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో సీఐలు ఆంజనేయులు, కరీం, రాఘవన్, జనార్దన్ ఈ కేసు దర్యాప్తు చేపట్టారనీ, నిందితుల్లో ఐదుగురిని హిందూపురం డంపింగ్ యార్డ్ వద్ద మంగళవారం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. తమ విచారణలో నిందితులు నేరం ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. హిందూపురం పట్టణంలోని త్యాగరాజ్ నగర్‌కు చెందిన మోస్ట్‌వాంటెండ్ క్రిమినల్, అంతర్రాష్ట్ర దొంగ ఎరుకల కావడి నాగేంద్ర అలియాస్ నాగ, అలియాస్ రోబో, అదే ప్రాంతానికి చెందిన సాకే ప్రవీణ్‌కుమార్, ముగ్గురు మైనర్లను అరెస్టు చేశామని తెలిపారు. ఎరుకల నాగేంద్ర, సాకే ప్రవీణ్‌కుమార్, పరారీలో ఉన్న చాకలి శ్రీనివాస్ పాత నేరస్థులని తెలిపారు. నాగేంద్ర 37 కేసుల్లో నిందితుడనీ, మరో 30కిపైగా కేసులను కోర్టు కొట్టివేసిందని తెలిపారు. సాకే ప్రవీణ్ కుమార్‌పై లేపాక్షి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసు ఉందనీ, పరారీలో ఉన్న మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ చాకలి శ్రీనివాసులుపై హిందూపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో దోపిడీ కేసు ఉందని తెలిపారు. నిందితులు ఆరుగురు రెండు ద్విచక్ర వాహనాల్లో చోరీ కోసం వెళ్లారని, అప్పటికే మిల్లు వద్ద వాచ్‌మన్‌గా ఉంటున్న కర్ణాటక కుటుంబంపై కన్నేశారని ఎస్పీ తెలిపారు. రెండు, మూడుసార్లు రెక్కీ నిర్వహించారని, ఈనెల 11న అర్ధరాత్రి దాటాక అక్కడికి వెళ్లి ద్విచక్ర వాహనాలు ఆపారని, కుక్కలు మొరగడంతో వాచ్‌మన్ టార్చ్‌లైట్ వేసి చూశారని తెలిపారు. అతని వద్దకు వెళ్లి ఉద్దేశపూర్వకంగా తాగునీరు అడిగారనీ, ముందుకు వస్తున్న వారిని వాచ్‌మన్ అడ్డుకున్నాడని తెలిపారు. అరుపులు విని భార్య, కుమారుడు, కోడలు బయటకు వచ్చారన్నారు. తండ్రీకొడుకుల వద్ద నిందితుల్లో ఇద్దరు కాపలా ఉండి, అత్తాకోడలిని మిగతావారు రేకుల షెడ్‌లోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు.

సీఎం సీరియస్ కావడంతో..

సామూహిక అత్యాచార ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా పరిగణించడంతో ఎస్పీ రత్న స్వయంగా రంగంలోకి దిగారు. నేరం జరిగిన ప్రాంతం సమీపంలో రెండురోజులపాటు మకాం వేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దుండగుల ముఖచిత్రాలు గుర్తించి, 48 గంటల్లోపే కేసును ఛేదించారు. నిందితుల్లో ఐదుగురిని అరెస్టు చేశారు. నిందితులు గతంలో పలుప్రాంతాల్లో దారిదోపిడీలు, చోరీలు చేశారని, ఆ సమయాల్లో ఒంటరిగా వెళ్లే జంటలపై నిఘావేసి అఘాయిత్యాలకు పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న చాకలి శ్రీనివాసులు.. మహిళలపై అత్యాచారాలకు మాత్రమే పాల్పడేవాడన్నారు. మహిళలను చాలా ఇబ్బందులు పెట్టేవాడని తమ విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. అతడిని త్వరలో పట్టుకుంటామని అన్నారు. అత్తాకోడలిపై గ్యాంగ్‌రేప్ అనంతరం వారి వద్ద ఉన్న రూ.5200 నగదు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఆ నగదుతోపాటు వారు వినియోగించిన రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐలు ఆంజనేయులు, కరీం, రాఘవన్, జనార్దన్, సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేశారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బొరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము తేది. 23.10.2024 నాడు వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
HDPURPJ2401120001	RAJASHEKAR E	PNGD2PJ2404290006	THUMMALAKUNTA ROSHAN JAMEER
HDPURPJ2401310001	ASWARTHA REDDY	PNGD2PJ2404250003	ANJINAPPA B
HDPURPJ2401120002	RAJASHEKAR E		
PNGD2PJ2404060011	THUMMALAKUNTA ROSHAN JAMEER		

క్రింద ఉదహరించిన చిరునామా వద్ద వేలం వేయడం జరుగుతుంది: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, D.NO 1-1178 1ST FLOOR SKD ROAD ,PENUKONDA -515110, వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ N CHENGAL REDDYను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 15.10.2024
స్థలం : అనంతపురం

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



తడవకుండా.. వడి వడిగా..







చిటపట చినుకులు

అల్ప పీడనం అనంతను తడిపేస్తోంది. రెండు రోజులుగా మబ్బులు కమ్మిన ఆకాశం ఒక్కసారిగా వాతావరణాన్ని మార్చేసింది. అనంతపురం నగరంలో మంగళవారం ఉదయం వానలో తడుస్తూ.. చలికి వణుకుతూ చిన్నారులు బడికి, పెద్దలు పనులకు హడావుడిగా వెళ్లడం కనిపించింది. ఎప్పటిలాగానే చిన్నపాటి వానకే రోడ్లు కాలువలయ్యాయి. డ్రైనేజీలో నీరు రోడ్డు మీదకు వచ్చింది. వాహనాలు రయ్ రయ్‌మని దూసువెతుంటే.. తారు రోడ్లు నొప్పి భరించలేక కెవ్వున అరుస్తూ నీటిని పాదచారులపై చిమ్ముతూ కనిపించాయి. మరో రెండు మూడు రోజులపాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. లోతట్టు ప్రాంతాలు జాగ్రత్తగా ఉండాలి. మరీ ముఖ్యంగా.. ఇళ్లలోకి నీరు చొరబడే ప్రమాదం ఉన్నవారు తిండిగింజలు, సామగ్రిని భద్రపరుచుకుంటే మేలు.

-అనంతపురం అర్బన్





స్నేహం మధురం

కొట్లాడకుండా.. భద్రత

యాడికి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు జరిగే ప్రమాదం ఉండటంతో పోలీసులు పట్టణంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. యాడికి సీఐ ఈరన్న, యాడికి రూరల్ సీఐ రామసుబ్బయ్య, తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి మంగళవారం పట్టణంలో పర్యటించి భద్రతను పర్యవేక్షించారు. యాడికి మండలంలో నాలుగు ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుమతి ఉండగా.. ఇందులో మూడింటిని టీడీపీ వర్గీయులు దక్కించుకున్నారు. ఒక దుకాణాన్ని వైసీపీ వర్గీయుడు దక్కించుకున్నారు. యాడికిలో ఏర్పాటు చేయనున్న ఆ ఒక్క మద్యం దుకాణం విషయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం నెలకొంది. ఇరువర్గాలవారు సోమవారం రాత్రి పరస్పరం దాడులకు ప్రయత్నించారు. ముందుగానే పసిగట్టిన పోలీసులు వారిని చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి వచ్చేదాకా భద్రత కొనసాగించాలని నిర్ణయించారు.



పోలీసు బందోబస్తు

జీడిపల్లికి 1144 క్యూసెక్కుల వరద

బెళుగుప్ప, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయరుకు 1144 క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ఫేజ్-2కు 1104 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.634 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చిలమకూరు వద్ద ఇసుక రీచ్

హద్దులు గుర్తించిన అధికారులు

యల్లనూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిత్రావతి నదిలో ప్రభుత్వ ఇసుక రీచ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. చిలమకూరు సమీపంలోని నదిలో మంగళవారం హద్దులు ఏర్పాటు చేశారు. చిలమకూరు, కోడిమూర్తి గ్రామాల మధ్య 4.230 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 63 వేల టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతులు వచ్చాయి. దీంతో రీచ్ ఏర్పాటు చేసేందుకు మైనింగ్ శాఖ డీడీ వెంకటేశ్వరరావు, తాడిపత్రి ఏడీఏ ఓబుల్‌రెడ్డి హద్దులు ఏర్పాటు చేశారు. రీచ్‌లో త్వరలో ఇసుక తవ్వకాలు ప్రారంభమవుతాయని, కాంట్రాక్టర్ అందుబాటులో ఉన్నారని వారు తెలిపారు. ఇసుక తవ్వకాలతో తమకు వరద ముప్పు ఉంటుందని, వేరే ప్రాంతంలో రీచ్ ఏర్పాటు చేయాలని చిలమకూరు గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీచ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, మార్చడానికి వీలుకాదని అధికారులు వారికి నచ్చజెప్పారు.



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

న్యూస్ బాక్స్

రేపు వాల్మీకి జయంతి వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలను గురువారం నిర్వహిస్తున్నామని ఆ శాఖ డీడీ కుష్బూ కొఠారీ తెలిపారు. 17వ తేదీ ఉదయం 11 గంటలకు నగరంలోని గుత్తి రోడ్డు బళ్లా కన్వెన్షన్ హాల్‌లో వేడుకలు మొదలౌతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్, పలువురు రాష్ట్రస్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. వేడుకలలో పాల్గొనే వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు, కులసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

మార్కెట్‌కు భారీగా టమోటా

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు దిగుబడుల రాక మరోమారు పెరిగింది. కొన్ని రోజులుగా దిగుబడులు తగ్గిపోయాయి. ఈ క్రమంలో రైతులకు మంచి ధర లభించింది. తాజాగా దిగుబడులు పెరగడంతో మార్కెట్‌కు మంగళవారం 2700 టన్నుల టమోటాలు వచ్చాయి. దిగుబడుల పెరుగుదల ప్రభావం ధరలపై పడే అవకాశం ఉంటుందని వ్యాపారవర్గాలు అంటున్నాయి. వాతావరణంలో మార్పులు, తుఫాను ప్రభావం కూడా టమోటా పడే అవకాశం కనిపిస్తోంది. మార్కెట్‌లో మంగళవారం కిలో టమోటా గరిష్ఠంగా రూ.50 పలికాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.25 పలికాయని ఆయన తెలిపారు.

19న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జడ్పీ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమౌతుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత జూలై 9న మొదటి సమావేశం నిర్వహించారు. ఇది రెండో సమావేశం. తొలి సమావేశం కొత్త ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులకు స్వాగతం పలకడం, పలకరింపుల కారణంగా సాదాసీదాగా సాగింది. రెండో సమావేశం ఇందుకు భిన్నంగా, ప్రజా సమస్యలపై చర్చ జరిగేలా ఉంటుందని భావిస్తున్నారు.

గమనించండహో..!

ఇంటర్వ్యూలు వాయిదా

అనంతపురం విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పోస్టుల భర్తీలో భాగంగా నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు ఈ నెల 16, 17,18 తేదీల్లో నిర్వహించాల్సి ఉందన్నారు. వర్షాల నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు ఇబ్బందులు పడే అవకాశం ఉండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటర్వ్యూల తేదీలు మార్చినట్లు తెలిపారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ అభ్యర్థులకు 23న, కళ్యాణదుర్గం డివిజన్ అభ్యర్థులకు 24, గుంతకల్లు డివిజన్ అభ్యర్థులకు 25వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పీడీ పేర్కొన్నారు.

అలజడి

జడివానకు విజృంభిస్తున్న తెగుళ్లు
తీవ్రంగా దెబ్బతింటున్న పంటలు
మందులు వాడినా ప్రయోజనం సున్నా
ఆందోళనలో అన్నదాతలు

కళ్యాణదుర్గం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జడివాన అన్నదాతకు దడ పుట్టిస్తోంది. ఎడతెరిపిలేకుండా వాన కురుస్తుండటంతో తెగుళ్లు విజృంభిస్తున్నాయి. పంటంతా పాడైపోయి దిగుబడి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ముసురుకున్న మబ్బులతో జడివాన కురుస్తుండటంతో పంటలను అనేక చీడపీడలు ఆశిస్తున్నాయి. ముఖ్యంగా టమోటా, బీర, వేరుశనగ, కర్బూజ, కలింగర, దానిమ్మ, బొప్పాయి పంటలు దెబ్బతింటున్నాయి. పురుగు మందులు వాడినా తెగుళ్లు అదుపులోకి రావడం లేదని వారు చెబుతున్నారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ ప్రాంతాల్లో సుమారు 800 ఎకరాలకు పైబడి కర్బూజ, కలింగర, టమోటా, బీర, మిరప, వేరుశనగ పంటలు సాగు చేశారు. ఈ సారి టమోటా పంటను ఎక్కువగా సాగు చేశారు. కర్బూజ కోత సమయంలో జడివాన రావడంతో పంటకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. ధర ఆశాజనకంగా ఉన్నప్పటికీ తెగులు రావడంతో దిగుబడి దారుణంగా పడిపోయి, తొలగించే పరిస్థితులు వస్తున్నాయి. టమోటాకు మచ్చతెగులు వచ్చి, పూతంతా రాలిపోయింది. ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఒక్కసారి మందును పిచికారి చేయాలంటే ఎకరాకు సుమారు రూ. 10 వేలు దాకా ఖర్చు అవుతుండటంతో రైతులు పెట్టుబడికి భయపడుతున్నారు. మచ్చతెగులు వల్ల ఉన్న కాయలు సైతం పనికిరాకుండా పోతున్నాయి. బీర పంటకు కూడా మచ్చతెగులు సోకడంతో ఆకులన్నీ ఎరుపు రంగులోకి మారిపోయాయి. దీంతో దిగుబడి ఆశించిన మేర ఉండటం లేదు. వేరుశనగ పంట ఊడలు దిగే సమయంలో జడివాన కురుస్తుండటంతో బూడిద తెగులు విజృంభిస్తోంది. దీంతో దిగుబడి ఏమాత్రం ఉండటం లేదు. కొన్ని చోట్ల బోరు బావుల కింద సాగుచేసిన వేరుశనగ పంటను కోత కోశారు. జడివానతో వేరుశగన కట్టె నల్లగా మారిపోతోంది. పశుగ్రాసానికి పనికిరాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వర్షంతో బీర పంటకు సోకిన మచ్చతెగుళ్లు





వర్షం దెబ్బకు టమోటా కాయలపై పూర్తిగా ఏర్పడిన మచ్చలు

టమోటాకు మచ్చతెగులు



నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశా. జడివాన దెబ్బకు టమోటాకు పూర్తిగా మచ్చ తెగులు సోకింది. ఈ తెగులు నివారణకు ఒకసారి పురుగు మందు పిచికారీ చేయాలంటే ఎకరాకు రూ. 10 వేల దాకా ఖర్చు అవుతోంది. ఇంత ఖర్చు పెట్టినా తెగులు అదుపులోకి రావడం లేదు. దీంతో భయమేసి అలాగే వదిలేశాం.

- నరేష్, రైతు, ఒంటారెడ్డిపల్లి

వేరుశనగకు మొలకలు వచ్చాయి



నేను ఐదు ఎకరాలలో వేరుశనగ పంట సాగు చేశా. రెండు రోజుల నుంచి పంట కోత కోస్తున్నాం. అయితే జడివానకు వేరుశనగ కట్టె పూర్తిగా నల్లగా మారిపోయింది. కాయలు మొలకెత్తుతున్నాయి. వీటిని వ్యాపారులు కొనేందుకు ముందుకు రారు. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇలాగే మరో రెండు రోజులు వర్షం కురిస్తే పంటంతా పూర్తిగా నష్టపోతాం.

- రవి, రైతు, ఒంటారెడ్డిపల్లి

మూడు రోజులు వానలు

పంటలను జాగ్రత్తగా చూసుకోండి
రైతులకు వాతావరణ శాస్త్రవేత్తల సూచన

బుక్కరాయసముద్రం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజులు తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురిసే అవకాశం ఉందని అన్నారు. పంట పొలాల్లో రసాయన ఎరువుల పిచికారీని రైతులు వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. ఉమ్మడి జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.3-30 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.8-23.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చునని తెలిపారు. గాలులు గంటకు 2-7 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని అన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 74-88 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

శనగ విత్తుకోండి..

- ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు శనగ పంట సాగుకు అనుకూలమని ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు తెలిపారు. నవంబరు ఒకటో తేదీ వరకూ రైతులు శనగ పంటను సాగు చేసుకోవచ్చని అన్నారు. ఎకరానికి 30-35 కేజీల శనగ విత్తుకోవాలని సూచించారు. విత్తుకునే ముందు కిలో విత్తనానికి ఎనిమిది గ్రాముల ట్రైకోడెర్మ విరిడి పొడి, 3 గ్రాములథైరమ్ లేదా 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. దీంతో విత్తనం ద్వారా వ్యాపించే రోగాలను చాలా వరుకు అరికట్టవచ్చని తెలిపారు.
- మొక్కజొన్న పంట శాఖీయ దశ నుంచి గింజ అభివృద్ధి దశలో ఉందని తెలిపారు. అందుబాటులో ఉన్న తేమను వినియోగించుకుని మొక్కజొన్న పంటలో నత్రజని యాజమాన్యం చేపట్టాలని సూచించారు.
- అధిక వర్షాలతో ముంపునకు గురైన తోటల్లో వర్షాలు తగ్గిన తరువాత మురుగు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని సూచించారు.
- గాలిలో అధిక తేమ శాతం కారణంగా అరటికి సిగటోక, ఆకు మచ్చతెగులు ఆశించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ తెగుళ్ల నివారణకు మినరల్ ఆయిల్ 5 మి.లీ., డైఫెన్‌కొనజోల్ 0.5 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి రెండు మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు.

వాల్మీకుల ఆకాంక్షలను నెరవేర్చండి

మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే కాలవ వినతి

అనంతపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితాలో తమను తిరిగి చేర్చాలని వాల్మీకి, బోయలు దశాబ్దాలుగా కోరుతున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విన్నవించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో మంత్రి లోకేశ్‌ను మంగళవారం ఆయన కలిశారు. వాల్మీకి జయంతిని రాష్ట్రస్థాయి పండుగగా నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి చిత్రపటాన్ని బహూకరించారు. వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చే అంశం గురించి మంత్రితో చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చేసిన కృషిని లోకేశ్‌కు గుర్తు చేశారు. అప్పట్లో ఈ సమస్యపై శాస్త్రీయ అధ్యయనం చేయించారని, కేంద్రానికి సిఫార్సు చేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రం, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయని, వాల్మీకుల్లో కొత్త ఆశలు చిగురించాయని అన్నారు. వాల్మీకి, బోయల దశాబ్దాల కలను నెరవేర్చేందుకు ఇదే సరైన సమయమని, ప్రత్యేక చొరవ చూపాలని కాలవ విజ్ఞప్తి చేశారు.



నారా లోకేశ్‌కు వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని బహూకరిస్తున్న కాలవ శ్రీనివాసులు

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి బెంగళూరు-కలబురగి (వయా గుంతకల్లు) మధ్య నాలుగు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి (నం. 06533) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30వ తేదీ, నవంబరు 2వ తేదీన బెంగళూరులో రాత్రి 9-15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-40 గంటలకు కలబురగికి చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06534) ఈ నెల 31వ తేదీ, నవంబరు 3వ తేదీన ఉదయం 9-35 గంటలకు కలబురగిలో బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుంది. యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాద్‌నగర్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.

అస్తవ్యస్తం

రేషన్ పంపిణీలో అక్రమాలు, ఇబ్బందులు
బఫర్ స్టాక్ ఇవ్వని పాత డీలర్లు
అందరికీ అందని అన్ని సరుకులు
ఎండీయూ వాహనదారుల ఇష్టారాజ్యం
తక్కువ తూకాలపై కార్డుదారుల ఆగ్రహం



బియ్యం తక్కువగా ఇస్తున్నారని చూపుతున్న లబ్ధిదారుడు సురేష్

అనంతపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా సాగుతోంది. వైసీపీ పాలనలో ఎదురైన ఇబ్బందులే ప్రస్తుతం కూడా ఉండటంతో రేషన్‌కార్డు లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1645 రేషన్‌షాపులు, 6,67,263 మంది లబ్ధిదారులు ఉన్నారు. నెలకు 9,716 మెట్రిక్‌టన్నుల బియ్యం కేటాయించనున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలవరకు 2,654 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉన్నట్లు అధికారులు తేల్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో డీలర్లను మార్పు చేశారు. కొత్తవారికి పాతవారు బఫర్‌స్టాక్ హ్యాండోవర్ చేయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా అది జరగలేదు. కానీ సివిల్ సప్లై అధికారులు మాత్రం బఫర్ స్టాక్‌ను తీసేసి బియ్యం కేటాయిస్తూ వస్తున్నారు. దీంతో అందరికీ బియ్యం, ఇతర సరుకులు అందకుండాపోతున్నాయి. జిల్లాకేంద్రంలో రెండు నెలలుగా లబ్ధిదారులకు బియ్యమే ఇవ్వడంలేదు. కనీసం ఈసమస్య ఎవరికి చెప్పుకోవాలో కూడా లబ్ధిదారులకు అర్థం కావడంలేదు. డీలర్లను అడిగితే మాకు వచ్చిన సరుకులే ఇస్తున్నామంటూ చెబుతున్నారు. సచివాలయంలోకి వెళ్లి ఫిర్యాదు చేసినా ఇదిరాజకీయాలతో ముడిపడి ఉండటంతో వారుకూడా ఈవిషయంలో ఏమిచేయలేక పై అధికారులకు చెబుతామని చెప్పి తప్పించుకుంటున్నారు.

తక్కువ తూకాలు

జిల్లాకేంద్రంలో ఏకాలనీకి వెళ్లినా, ఏప్రాంతానికి వెళ్లినా సగం మంది లబ్ధిదారులు బియ్యం ఇవ్వలేదు, కంది పప్పు, చక్కెర ఇవ్వలేదని చెబుతున్నారు. తక్కువ తూకాలు వేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని రెండో రోడ్డులో మంగళవారం ఎండీయూ వాహనంలో 13.5 కిలోల బియ్యం వేసి 15 కిలోలు ఇచ్చినట్లు వేలిముద్రలు వేయించుకున్నారు. లబ్ధిదారుడు సురేష్ కొంతమంది మహిళలు ఆ ఎండీయూ వాహన పైలెట్‌తో రగడకు దిగి నిలదీసారు. అయినా ఆయన మాత్రం నేనింతే మీకు దిక్కున్నచోట చెప్పుకోండని చెప్పి వెళ్లి పోయాడు. దీన్ని బట్టి పరిస్థితి ఎంతదారుణంగా ఉందో తెలుస్తోంది.



రెండునెలలుగా ఎండీయూ వాహనం రాలేదని చెబుతున్న మహిళలు

వాహనదారుడిపై చర్యలు తీసుకోవాలి

రెండునెలలుగా బియ్యం వేయడానికి రాలేదు. ఇపుడు ఇచ్చి 13.5 కిలోల బియ్యం ఇచ్చి 15కేజీలు ఇచ్చినట్లు వేలిముద్రలు వేయించుకుంటున్నారు. ఇదేమి అన్యాయం అని అడిగితే మాపైనే తిరుగుబాటు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడి ఇప్పుడు కూడా అలాగే చేస్తున్నారు. వీరిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సురేష్, కార్డు లబ్ధిదారుడు

దసరా కోళ్లు..!

ఊరికి దూరంగా గుంపుగా కనిపిస్తే.. పేకాట ఆడుతున్నారని పోలీసులు అనుకున్నారు. ఒక్కసారిగా చుట్టుముట్టడంతో పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంబడించి పట్టుకున్న పోలీసులకు.. వారు ఆడుతున్నది పేకాట కాదు.. కోడి పందేలు అని తెలిసింది. మొత్తంగా ఏడుగురి గుంపును పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.30,190 నగదు, ఐదు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరి పందెం కోళ్లు ఏమయ్యాయి..? అనే కదా మీ అనుమానం..? పందెం వీరుల తరహాలోనే కోళ్లు కూడా పారిపోయేందుకు చూశాయట. పోలీసులు వాటిని కూడా పట్టుకున్నారు. రెండు కోళ్లను సీజ్ చేశారని తెలిసింది. కందుకూరు శివారు ప్రాంతంలో ఏదో జరుగుతోందని ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్‌కు మంగళవారం సమాచారం వచ్చింది. సీఐ సూచనలతో ఎస్‌ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. చాలాకాలంగా ఇక్కడ కోడి పందేలు జరుగుతున్నాయని సమాచారం. పేకాట, మట్కా, బెట్టింగ్ తరహా జూదాలకు పరిమితమైన 'ఆటగాళ్లు' సరదాగా కోడి పందేలవైపు మళ్లినట్లున్నారు. అయినా.. ఇది సంక్రాంతి కాదు దసరా..! మనది కోనసీమ కాదు.. రాయలసీమ..! కోళ్లను పెంచాలిగాని.. కొట్లాటలకు దించితే ఎట్ల..?

- అనంతపురం క్రైం(ఆంధ్రజ్యోతి)



పట్టుబడిన పందెగాళ్లతో పోలీసులు

4 నుంచి డీఎడ్ పరీక్షలు

బుక్కపట్నం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని డీఎడ్ విద్యార్థులకు నవంబరు 4వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు బుక్కపట్నంలోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవిసాగర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2023-25 బ్యాచ్ రెగ్యులర్ విద్యార్థులు, 2021-23, 2022-24లో ఒకసారి ఫెయిలైన వారికి డీఎడ్ సెకండ్ సెమిస్టర్ పరీక్షలు 4వ తేదీ నుంచి ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఉంటాయన్నారు. 2018-20 బ్యాచ్ డీఎడ్ వారికి మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు నవంబరు 4 నుంచి ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ల్యాబ్‌లా.. గోడౌన్‌లా..?

- ఈవీఎంల గోడౌన్‌గా జేఎన్‌టీయూ
- ల్యాబ్‌లు, తరగతి గదుల్లో ఉంచిన అధికారులు
- ఎన్నికల తంతు ముగిసినా తరలించని వైనం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఫ్యాకల్టీ
- కలెక్టర్ ఆదేశాలు పెడచెవిన పెట్టిన రెవెన్యూశాఖ



ఈవీఎంలు భద్రపరిచిన మెకానికల్ ఇంజనీరింగ్ భవనం

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ల్యాబ్‌లు, తరగతి గదులు ఈవీఎంల గోడౌన్‌లుగా మారిపోయాయి. ఎన్నికల సమయంలో స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ రూమ్‌లకు అవసరమైన విధంగా ఈ గదులను మార్చుకున్నారు. ఎన్నికల ప్రక్రియ అంతా ముగిసినా ఆ గదులను మాత్రం మునుపటి స్థితికి తీసుకురాలేదు. అయినా కళాశాల యాజమాన్యమే సొంత నిధులతో పనులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చింది. పూర్తిస్థాయిలో పనులు చేయించాలంటే మరింత ఖర్చు పెట్టాల్సి ఉంది. ప్రస్తుతం తరగతులు, ల్యాబ్‌ల నిర్వహణకు ఇబ్బందిలేకుండా మాత్రమే పనులు చేయించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలోని క్లాస్‌రూమ్‌లు, ల్యాబ్‌లు, టీచింగ్ ఫ్యాకల్టీ రూమ్‌లను స్వాధీనం చేసుకుని ఈవీఎంలను భద్రపరిచారు. వీటిని తరలించి ఖాళీ చేయించాలంటే ఎన్నికల కమిషన్(ఈసీ) అనుమతి అవసరం కావడంతో కళాశాల యాజమాన్యం దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంది. వాటిని తరలించాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు పలుమార్లు లేఖలు రాసినా, వారిని కలిసి విన్నవించినా ఫలితం లేదని యాజమాన్యం వాపోతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలైనా ల్యాబ్‌లు, క్లాసులు పూర్తిగా అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నెలలుగా...

ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ విభాగంలో ఉన్న రెండంతస్తుల భవనమే అన్నిటికి దిక్కు. ఇందులోనే తరగతులు, స్టాఫ్ రూమ్‌లు, సీమాన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లున్నాయి. ఈవీఎంలను భద్రపరిచేందుకు ఈ భవనాన్ని ఈసీ స్వాధీనం చేసుకోవడంతో రోజువారి విద్యా కార్యకలాపాలన్నీ స్తంభించాయి. నాలుగు నెలలుగా విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఈ భవనానికి దూరంగా ఉంటున్నారు. తరగతులు, ల్యాబ్‌లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. కేటాయించిన గదుల్లో కూర్చోవడానికి కూడాలేదని, అటువైపు వెళ్లేందుకు లేకుండా బల్లలు అడ్డంగా వేశారని అధ్యాపకులు మండిపడుతున్నారు.

రూ.లక్షల్లో ఖర్చు

జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్, అదనపు ఎన్నికల అధికారిగా డీర్వో(జిల్లా రెవెన్యూ ఆఫీసర్) వ్యవహరిస్తారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిధులు జిల్లా కలెక్టర్‌కు వస్తాయి. క్షేత్రస్థాయిలో పనులు చేయించే బాధ్యత డీర్వో తీసుకుంటారు. అందుకు అవసరమైన నిధులు కలెక్టర్ నుంచి డీర్వోకు విడుదల అవుతాయి. జేఎన్‌టీయూలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల కమిషన్ రూ.లక్షలు వెచ్చించింది. ప్రతి రూపాయి రెవెన్యూ శాఖ ద్వారా ఖర్చుచేసి అందుకు సంబంధించిన బిల్లులను కలెక్టర్‌కు సమర్పించారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడి పనులు అక్కడే వదిలేసి చేతులు దులుపుకున్నారని జేఎన్‌టీయూ విద్యార్థి వర్గాలు మండిపడుతున్నాయి.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

జేఎన్‌టీయూలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ఉపయోగించిన భవనాలు మునుపటి స్థితికి తీసుకురావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఇటీవల నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీచేశారు. అయినా సంబంధిత విభాగం అధికారులు కలెక్టర్ ఆదేశాలను పెడచెవిన పెట్టారు. ఆదేశాలతో పనులు జరిగిపోవని, పెట్టిన బిల్లులకు నిధులు విడుదల చేస్తేనే వేగవంతమౌతాయని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన రూ.కోట్లలో కనీసం రూ.లక్షలకు బిల్లులు కావడంలేదని వాపోతున్నాయి. ఆ నిధులు ఏమయ్యాయో కలెక్టరేట్ వర్గాలకే తెలియాలని పేర్కొంటున్నాయి.

తరలిస్తాం: రామకృష్ణారెడ్డి, డీఆర్వో



జేఎన్‌టీయూ నుంచి ఈవీఎంలను తరలించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ విషయాన్ని సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు తెలియజేశాం. త్వరలోనే వాటిని తరలించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

కదులుతున్న గంజాయి డొంక

గ్యాంగ్‌రేప్ నిందితుల విచారణలో సమాచారం

- పోలీసుల అదుపులో ముఠా సభ్యులు
- పరారీలో కీలక వ్యాపారి
- దేశం దాటేందుకు ప్రయత్నాలు



హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్యాంగ్ రేప్ నిందితుల విచారణతో గంజాయి డొంక కదులుతోంది. పురం ప్రాంతంలో ఐదేళ్ల క్రితం వరకు గంజాయి చాలా అరుదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చిల్లర కొట్టులో కూడా దొరికే పరిస్థితి ఏర్పడింది. నిర్విఘ్నంగా సాగిన ఈ వ్యాపారం డొంక చిలమత్తూరు మండలంలో అత్తాకోడలి గ్యాంగ్ రేప్‌తో కదులుతోంది. నిందితులను పోలీసులు విచారించిన సమయంలో గంజాయికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వారిచ్చిన సమాచారంతో గంజాయి వ్యాపారం పురంలో ఏ మేరకు వేళ్లూనుకుపోయిందో స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. పలు నేరాలకు పాల్పడిన నిందితులు అధిక శాతం గంజాయి సేవించినట్లు పోలీసుల విచారణలో వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్యాంగ్‌రేప్ నిందితుల్లో ఒకరిద్దరు గంజాయి సేవించినట్లు పోలీసుల విచారణలో తేలగా.. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

నిందితుల విచారణతో వెలుగులోకి..

ఇటీవల చిలమత్తూరు మండలంలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన హిందూపురానికి చెందిన నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చూపించారు. విచారణలో భాగంగా వారి నేరాలపై ఆరాతీశారు. ఈ క్రమంలో గంజాయిపై కూడా వివరాలు సేకరించారు. హిందూపురానికి గంజాయి సరఫరా చేస్తున్న వ్యాపారులతో పాటు ఇక్కడ క్రయవిక్రయాలు సాగిస్తున్న ముఠా సభ్యుల వివరాలు బయటకు పొక్కినట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లుగా గంజాయి వ్యాపారానికి సహకరించిన పలువురు వైసీపీ నాయకుల పేర్లను కూడా బయట పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. విచారణలో నిందితులు చెప్పిన విషయాలపై పోలీసులు ఆరాతీస్తున్నారు.

అదుపులో గంజాయి ముఠా..

గ్యాంగ్ రేప్ నిందితుల సమాచారంతో హిందూపురంలో గంజాయి వ్యాపారం చేస్తున్న పలువురిని జిల్లా ఎస్పీ టీం తీసుకెళ్లి, విచారిస్తున్నట్లు సమాచారం. వారి విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని తెలుస్తోంది. గత ఐదేళ్లలో హిందూపురం ప్రాంతంలో నేరాలు పెరగడానికి గంజాయి కూడా ఒక కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఎందుకంటే అత్యాచారం చేసిన నిందితులు చెప్పిన విషయాలు పోలీసులనే నివ్వెరపర్చినట్లు సమాచారం. దీంతో గంజాయిని తుదముట్టిస్తే తప్ప.. నేరాలు అదుపులోకి రావనే దిశగా పోలీసులు చర్యలు తీసుకోబోతున్నారు.

పరారీలో కీలక వ్యాపారి

కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తెప్పించి, విక్రయిస్తున్న కీలక వ్యాపారి పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీసులు.. గంజాయి ముఠా సభ్యులపై దాడులు చేయగా అప్రమత్తమైన కీలక వ్యాపారి పరారయ్యాడు. ఆ వ్యాపారి దేశం దాటేందుకు కూడా సిద్ధపడినట్లు సమాచారం. సాధారణ వ్యక్తిగా ఉంటూ రూ.కోట్లకు పడగెత్తడం వెనుక ఆయన చేస్తున్న గంజాయి వ్యాపారమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. అతని వ్యాపారానికి అడ్డు రాకుండా పలువురు అధికారులను సైతం తన గుప్పిట్లో పెట్టుకున్నట్లు సమాచారం. దీంతో ఓ శాఖలోని సిబ్బంది.. పోలీసులు దాడులు చేస్తారనే విషయం అతడికి చేరవేయడంతో పరారైనట్లు సమాచారం.

పుష్కలంగా అండదండలు

హిందూపురంలో కొంతకాలంగా సాగుతున్న గంజాయి వ్యాపారానికి కొన్ని శాఖల అధికారులు, పోలీసు శాఖలోని పలువురి సిబ్బంది అండదండలు పుష్కలంగా ఉన్నట్లు పోలీసు వర్గాలే చర్చించుకుంటున్నాయి. గంజాయి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్న సమయంలో నెల క్రితం వరకు తమ వ్యాపారులకు పోలీసు సిబ్బంది సహకరించిన తీరును వారు వెల్లడించినట్లు తెలిసింది. కీలక వ్యాపారి పరారవడానికి సిబ్బంది సహకారం ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మరో గంజాయి వ్యాపారిని తప్పించినట్లు జిల్లా ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. అతడిని తొలుత అదుపులోకి తీసుకున్నామని చెప్పి, వెంటనే పరారయ్యాడని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. పాతనేరస్థులతో పరిచయాలు, గంజాయి ముఠా సభ్యులతో సంబంధాలు, సహకారం పోలీసు సిబ్బందిలో ఎవరెవరిది ఉందన్న విషయంపై లోతుగా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి ముఠాను విచారిస్తున్న సందర్భంలో వారికి సహకారం అందిస్తున్న పోలీసు సిబ్బందిపై కూడా ప్రత్యేక విచారణ చేస్తున్నారు. ఏది ఏమైనా సామూహిక అత్యాచారం విచారణతో గంజాయి డొంక కదిలేలా ఉంది. ఈ నేపథ్యంలో గంజాయి నిర్మూలనకు మరికొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకోనున్నట్లు సమాచారం.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం

పరిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీచిగానిపల్లి, ఊటకూరు పంచాయతీల్లో బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత మంగళవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుటారు. మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, మొక్కలు నాటడం లాంటి కార్యక్రమాలు ఉపాధిహామీ నిధులతో చేపడుతున్నామన్నారు. దీపావళి పండగ సందర్భంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ శ్రీధర్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అనగాని

కడప జిల్లాకు మంత్రి సవిత

పుట్టపర్తి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమించారు. అనగాని సత్యప్రసాద్‌కు శ్రీసత్యసాయి జిల్లాతోపాటు తిరుపతి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లాకు చెందిన బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రిని కడప ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. ధర్మవరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సత్యకుమార్ యాదవ్‌కు ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు అప్పగించారు. వీరు ఆయా జిల్లాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును పర్యవేక్షించనున్నారు.

నేటి నుంచి ప్రైవేటు మద్యం

- జిల్లాలో తెరుచుకోనున్న 87 దుకాణాలు
- ఐదారు షాపులపై ఒత్తిళ్లు
- రోజంతా బెదిరింపులు.. వాటాల రాయబారాలు..
- లేపాక్షి దుకాణం కేటాయింపుపై వీడని ఉత్కంఠ



పుట్టపర్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం బ్రాండ్లు ఐదేళ్ల తరువాత ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఎక్సైజ్ కొత్త మద్యం పాలసీతో జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు దుకాణాల్లో మద్యం అమ్మకాలు బుధవారం ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 87 మద్యం దుకాణాలకు లాటరీ పద్ధతిన ప్రైవేటు లైసెన్సులను సోమవారం కేటాయించిన సంగతి తెలిసిందే. సోమవారమే అత్యధికంగా లైసెన్సు ఫీజు చెల్లించగా.. మరికొన్ని దుకాణాలకు మంగళవారం కట్టారు. మంగళవారం ప్రభుత్వ దుకాణాలను బంద్ చేశారు. బుధవారం నుంచి నూతన మద్యం పాలసీతో ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. మద్యం అమ్మకాలు మొదలు పెట్టనున్నారు. ఐదేళ్ల తరువాత ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మద్యం దుకాణాలు రాగా, కొత్త కొత్త బ్రాండ్లతో అమ్మకాలు ప్రారంభించనున్నారు. జిల్లాలో లాటరీ ద్వారా దక్కించుకున్న దుకాణాల్లో సిండికేట్ బృందంలో లేని మద్యం దుకాణాలను ఆయా నియోజకవర్గాల్లో స్థానిక అధికార కూటమినేతలతోపాటు మద్యం వ్యాపారులు, నేతలు తమకు వాటా ఇవ్వాలనీ, లేదంటే దుకాణమే ఇచ్చేయాలని ఒత్తిళ్లతో మంతనాలు, రాయబారాలు సాగించారు. పుట్టపర్తి, కొత్తచెరువు ప్రాంతాల్లో రెండు దుకాణాలను దక్కించుకునేందుకు స్థానిక నేతలు పోటీ పడ్డారు. ఒక్కో దుకాణం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల దాకా బేరం ఆడారు. పలు దుకాణాల్లో వాటాల పంచాయితీ కొనసాగుతోంది. సిండికేట్‌లోలేని హిందూపురం మున్సిపాలిటీలో 50వ, లేపాక్షిలో 57వ, తాడిమర్రిలో 16వ, కదిరిలో ఒకటి, ధర్మవరం రెండు, పరిగిలో రెండు, కొత్తచెరువులో ఒక్కోటి చొప్పున దుకాణాల ప్రారంభంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ధర్మవరంలో వైసీపీకి దక్కిన రెండు దుకాణాలను తమకే ఇవ్వాలని అధికార కూటమి నేతలు ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. తాడిమర్రిలో గుంటూరుకు చెందిన గణేష్‌కి దక్కడంతో స్థానిక నేతలు.. ఆయనపై ఒత్తిళ్లు చేస్తున్నారు. పరిగిలో రెండు దుకాణాల్లో అంతో..ఇంతో.. ఇస్తామనీ, వదిలిపెట్టాలనీ, లేదంటే తమ అనుచరులకు వాటా ఇవ్వాలని ఓ ప్రజాప్రతినిధి ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం అంతా ఇదే అంశంపై చర్చలు, రాయబారాలతో పరిగిలో ఒక దుకాణం దక్కించుకున్న విజయకుమార్ ఫోన్ స్విచాఫ్ చేశారు. సోమవారం లక్కీడ్రాలో లేపాక్షిలో 57వ నంబరు దుకాణం దక్కించుకున్న వ్యక్తి కిడ్నాప్ హైడ్రామా చివరకు సుఖాంతమైంది. లేపాక్షి షాపు దక్కించుకున్న రంగనాథ్ మంగళవారం లైసెన్సు ఫీజు మొదటి విడత ఆన్‌లైన్‌లో చెల్లించి, తమకు షాపు కేటాయించాలని బంధువులతో పుట్టపర్తిలోని ఈఎస్ ఆఫీసుకి వచ్చి అడిగారు. ఓసందర్భంలో కార్యాలయం వద్ద ధర్నాకు దిగేందుకు సన్నద్ధం కాగా.. ఎక్సైజ్ అధికారులు నచ్చజెప్పారు. ఆన్‌లైన్ పేమెంట్ చేశారా.. లేదా.. అనేది బుధవారం ఉదయం పరిశీలించి, అనంతరం నివేదిక రాస్తామనీ, ఆ మేరకు దుకాణం కేటాయిస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందునాయక్ వెల్లడించడంతో వెనుదిరిగారు. బుధవారం అన్ని షాపులు ప్రారంభించాల్సి ఉండగా.. మద్యం కొనుగోలు మాత్రం చాలా దుకాణాలకు మంగళవారం మొదలుపెట్టలేదు. మద్యం డిపోలో సిద్ధంగా ఉందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నా.. జిల్లావ్యాప్తంగా తొలిరోజు కొన్ని బ్రాండ్లతో అమ్మకాలు ప్రారంభించే అవకాశం కనిపిస్తోంది. లైసెన్సు దక్కించుకున్న వారి నుంచి తమకు వాటా ఇచ్చిన తరువాతే దుకాణాలు తెరవాలనీ, లేదంటే అడ్డుకోవాలని కొన్ని నియోజకవర్గాల నుంచి ఎక్సైజ్ అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కొత్త ఎక్సైజ్ పాలసీతో జిల్లా వ్యాప్తంగా 87లో బుధవారం ఎన్ని దుకాణాలు ప్రారంభమవుతాయో వేచిచూడాల్సిందే.

జాతీయస్థాయి పోటీలకు గోరంట్ల విద్యార్థి

గోరంట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి డిజైనింగ్, కోడింగ్ చాంపియన్ షిప్‌లో గోరంట్లకు చెందిన విద్యార్థి ధీరజ్ జ్యూరీ రౌండ్‌కు ఎంపికైనట్లు తండ్రి గంధం శ్రీధర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ధీరజ్ గోరంట్లలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. యాప్, గేమ్, గ్రాఫిక్స్, త్రీడీ, వెబ్ డిజైన్, మూవీ మేకింగ్, కోడింగ్ విభాగాల్లో జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భారత్‌తోపాటు సౌదీఅరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పోటీల్లో ధీరజ్ ప్రాజెక్టును పరిశీలించి ప్రాంతాలవారీగా జరిగే జ్యూరీ రౌండ్‌కు ఎంపిక చేసినట్లు చెప్పారు. రెండోదశ పోటీ ద్వారా జాతీయస్థాయిలో జరిగే అత్యుత్తమ ప్రాజెక్టును ఎంపిక చేస్తారని శ్రీధర్ తెలిపారు. ఈనెల 21న జ్యూరీ సభ్యులతో జూమ్ సమావేశం ద్వారా తన ప్రాజెక్టును ధీరజ్ వివరించనున్నాడు.



ధీరజ్

జాతీయస్థాయి ఘనత

హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌కు జాతీయ అవార్డు

- జలసంరక్షణలో ఆదర్శంగా నిలిచిన గ్రామం
- భూగర్భజలాల పెంపునకు ఊతమిచ్చిన పనులు



హంపాపురంలో పర్యటిస్తున్న కేంద్రజలశక్తి అభియాన్ నోడల్ అధికారులు (ఫైల్)

రాప్తాడు మండలంలోని హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ జాతీయ అవార్డుకు ఎంపికైంది. జలసంరక్షణలో ఆదర్శంగా నిలవడంతో 2023 సంవత్సరానికి గాను కేంద్ర జలశక్తి అభియాన్ హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌ను మూడో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసింది. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన కింద ఈ అవార్డును అందజేయనున్నారు.

- అనంతపురం క్లాక్‌టవర్, రాప్తాడు (ఆంధ్రజ్యోతి)



ఆదర్శంగా నిలిచిన గేబియాన్ రాతికట్టడం

22న రాష్ట్రపతి చేతుల మీదుగా..

జాతీయ ఉత్తమ వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌కు ఈనెల 22న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందజేయనున్నారు. దేశవ్యాప్తంగా కేవలం మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక చేయగా అందులో హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ ఒకటి. కేంద్రజలశక్తి అభియాన్ అధికారుల బృందం హంపాపురం గ్రామంలో చేపట్టిన వాటర్‌షెడ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

రూ.3.74కోట్లతో 78 పనులు

రాప్తాడు మండలం హంపాపురం గ్రామ పంచాయతీకి 2022-23 సంవత్సరానికి వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ మంజూరు చేశారు. మొత్తం 78 పనులకు రూ.3.74 కోట్ల నిధులు వెచ్చించారు. ఇక్కడ గతంలో తక్కువ వర్షపాతం ఉండటంతో భూగర్భజలాలు 31మీటర్ల లోతుకు ఉండేవి. వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ నిర్మాణం తరువాత భూగర్భజలాలు పెరిగాయి. దీంతో గ్రామంలో తాగు, సాగునీటి కొరత తీరింది. పంటల సాగు పెరిగింది. కొండలలో ఖండిత కందకం ఒకటి, చిన్నఊటకుంట, 8 సేద్యపుకుంటలు, 9 డగ్‌ఔట్ పాండ్‌లు, 4 అమృత్ సరోవర్, 3 చేపల గుంతలు, 5 సామూహిక నీటినిల్వ గుంతలు, 30 పైకప్పు నీటి ఇంకుడుగుంతలు, ఒకటి ప్రహరి కందకం, ఒక చెక్‌డ్యాం పూడిక తీత తొలగింపు, నీటి నిల్వ గేబియన్‌లు 15 ఇలా మొత్తం 78 పనులు చేపట్టారు. దీంతో గ్రామంలో జలవనరులు సమృద్ధిగా పెరిగాయి.

శుభపరిణామం: సుధాకర్‌రెడ్డి, ఏపీడీ



దేశంలో జాతీయ అవార్డుకు ఎంపికైన మూడు గ్రామ వాటర్‌షెడ్ ప్రాజెక్టులలో హంపాపురం ఉండటం శుభపరిణామం. ఈ అవార్డుతో జిల్లా కీర్తి ప్రతిష్ఠలు దేశవ్యాప్తం అవుతాయి. ఈస్ఫూర్తితో జిల్లాలో మరిన్ని వాటర్‌షెడ్ ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తాం. గ్రామ ప్రజలు, సిబ్బంది, జిల్లా ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సహకారంతోనే ఈ ఘనత సాధించాం. కేంద్రజలశక్తి అభియాన్ అధికారులు పర్యటించి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాం. బాగా చేశారని అప్పుడే అభినందించారు.

చాలా సంతోషం



గ్రామ పంచాయతీకి వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ రావడంతో చాలా సంతోషం పడ్డాం. వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ ద్వారా గ్రామానికి అవసరమైన పనులను చేశారు. వర్షం వచ్చినప్పుడు నేల కోతకోయకుండా రాతికట్టడం కట్టించాం. అదే విధంగా ఫారంపాండ్ గుంత తవ్వించాం. వర్షం నీరు వెళ్లిపోకుండా ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకిపోయేలా ఇంకుడు గుంతలు తవ్వారు. దీంతో గ్రామంలో బోర్లు రీచార్జ్ అయ్యి సాగు, తాగునీటి కొరత తీరింది. ఈక్రమంలో అవార్డు రావడంతో ఎంతో ఆనందం కలుగుతోంది.

- నంబూరి ప్రతాప్, రైతు, హంపాపురం

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA-198095

WANTED

Tally Prime Accounts, M.S ఆఫీస్ అనుభవం గల అకౌంటెంట్ కావలెను. జీతం 15,000 నుంచి 20,000 కలదు శ్రీ శబరి ఆయిల్ ట్రేడర్స్, పాతవూరు అనంతపురం Ph:9705340666.

AJA-189032

కావలెను

అనంతపురం నగరంలోని ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Cont.9381838140.

AJA-SATHISH

TO-LET

ప్రకాష్ రోడ్డు, (కోర్టు రోడ్ ప్రక్కన) 7-111 డో.నెం. నందు వాస్తు అనుసరించి తూర్పు దిక్కున గల ఇల్లు. మొదటి అంతస్తులో విశాలమైన (1500చ॥) 2 బెడ్ రూమ్ ఇల్లు. కార్ పార్కింగ్ సదుపాయములో అద్దెకు కలదు. సంప్ర: 9440907157

AJA-198092

WANTED

Civil engineer, Hostel wardens, HR manager, Diploma in computer science Montessori Elite Em school, gollapalli near marur toll gate, Anantpur Ph:8340038384.

AJA - 198093

FOR LEASE

3BHK flats of 2000 Sq.ft in Ramnagar Centrally Located for lease for Central/State Government Institutions ATP. Cell.9381617559.

AJA-LINGAMAIAH

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి

ధర్మవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో అక్రమ భవన నిర్మాణాన్ని అడ్డుకోవాలని 18వ వార్డు టీడీపీ నాయకులు కత్తుల బాబ్జీ, నాగరాజు, నల్లప్ప, ఆంజనేయులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిలాన్, రఫీ అనే వ్యక్తులు జీప్లస్ 1, జీప్లస్ 2 అనుమతులు తీసుకుని జీప్లస్ 4 కింద కమర్షియల్ భవనాన్ని నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేశారు. విచారించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుంటే చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ఉప్పలపాడు సంపు పరిశీలన

ముదిగుబ్బ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు సమీపంలోని తాగునీటి సంపును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎస్‌సీ మల్లికార్జున, డీఈ శాంతన్న మంగళవారం పరిశీలించారు. రెండు రోజుల్లో భారీవర్షాలు రానున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్‌ను ఆదేశించారు.

ఘనంగా విద్యార్థుల దినోత్సవం

ధర్మవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రేగాటిపల్లి రహదారి పక్కన గల వివేకానంద డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ హర్షవర్ధన్ కళాశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విద్యార్థుల కోసం, వారి భవిష్యత్తు కోసం ఆయన చేసిన కృషిని స్మరిస్తూ విద్యార్థుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

రేపు ఎడ్లబండ్ల పోటీలు

కొత్తచెరువు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం ఎడ్లబండ్ల పరుగుపందెం పోటీలను నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. స్థానికంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ధర్మవరం రహదారి పక్కన వ్యవసాయ పొలంలో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతిగా రూ.10 వేలు ఇస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు బుధవారంలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96525 86648ను సంప్రదించాలని ఆ సంఘం నాయకులు బండ్లపల్లిరాజు, డిపో భాస్కర్, విజయ్, నరసింహులు తెలిపారు.

విధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



కంట్రోల్‌రూంను పరిశీలిస్తున్న జేసీ

పుట్టపర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున కంట్రోల్ రూంలో పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంను ఆయన పరిశీలించారు. జిల్లాలో కంట్రోల్‌రూంకు వచ్చే సమాచారాన్ని సకాలంలో ఉన్నతాధికారులకు తెలియచేయాలని ఆదేశించారు.

సచివాలయ సిబ్బందిపై అధికారుల ఆగ్రహం

నల్లచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-2లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదంటూ సిబ్బందిపై అధికారులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సచివాలయాన్ని డీఎల్‌డీఓ పోలప్ప, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త తనిఖీ చేశారు. కనీసం సిబ్బంది వివరాలను సైతం రిజిష్టర్‌లో నమోదు చేసి ఉండకపోవడంపై మండిపడ్డారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

నల్లచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.పూలకుంటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ భారతి నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో వరి పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు వర్షాలు ఉన్న సమయంలో కోతలు కోయకూడదన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఓ దశర్థనాయక్, వీఏఏ సాధిక్‌వలీ, రైతులు పాల్గొన్నారు.

బుక్కపట్నం: మండలంలోని కొత్తకోటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మైక్రో ఇరిగేషన్ పీడీ సుదర్శన్, ఏడీఏ సనావుల్లా రైతులకు సూచించారు. డ్రిప్, స్పింకర్ల వాడి అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంటలకు సోకే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ఏఓ సతీష్‌బాబు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళి

కదిరి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక ఎన్జీఓ హోంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఇందులో మస్తాన్, అబ్దుల్‌మాలిక్, మహబూబ్ బాషా, ఇర్షాన్, గౌస్‌బాషా, నిజాంవలీ, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ

పుట్టపర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ విజయ్‌మార్, ఎస్ఐ లింగన్న, పలువురు పోలీసులు స్థానిక ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సూచించారు.

దోమలపట్ల అప్రమత్తంగా ఉండండి

నల్లచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ దోమలపట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కల్పన సూచించారు. మండలంలోని బోయపల్లిలో అనారోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలను మంగళవారం ప్రజలకు వివరించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, బయట పదార్థాలు తినకూడదని సూచించారు. దోమకాటుకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, ఏఎన్ఎం రోజా, ఎంఎల్‌హెచ్‌పీ తస్మిల్, సూర్యనారాయణరెడ్డి, ఆశ కార్యకర్త రమణమ్మ, బోయపల్లి గ్రామ గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



అనంతపురం కల్చరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో మంగళవారం వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, కార్యదర్శి కలవల మల్లికార్జున, కోశాధికారి ప్రసాద్, లక్ష్మినారాయణ, విశ్వనాథశెట్టి పాల్గొన్నారు.

శతాబ్దాల సమస్యకు మోక్షం..!

- వరగిరి వెంకటేశ్వరస్వామి ఆలయానికి రోడ్డు
- రూ.50 లక్షలతో నిర్మాణానికి చర్యలు
- నేడు పనులకు శంకుస్థాపన



ఆలయానికి వెళ్లే మట్టిరోడ్డు

బుక్కపట్నం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నానికి రెండు కిలోమీటర్ల దూరం.. చెరువులో వెలసిన పురాతనమైన వరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. హరిహర రాయలు, బుక్కరాయులు దాదాపు 800 సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించారు. జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు విరివిగా వస్తుంటారు. అయితే ఈ ఆలయానికి మొదటి నుంచీ సరైన రోడ్డు మార్గం లేదు. ఈ విషయాన్ని స్థానికులు, భక్తులు గత ప్రభుత్వ పాలకుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. నాటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆలయానికి రోడ్డు వేయిస్తానని హామీ కూడా ఇచ్చారు. అయితే మళ్లీ దాని గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. అనంతరం పలుమార్లు ఆ సమస్యను పాలకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన శూన్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ ఆలయానికి రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టారు. వారి కృషి వల్ల కూటమి ప్రభుత్వం రూ.50 లక్షలను మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బుధవారం శంకుస్థాపన చేస్తున్నారు. శతాబ్దాల సమస్య పరిష్కారం అవుతుండటంపై ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





బుక్కపట్నంలో వరగిరి వెంకటేశ్వరస్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి (ఇన్‌సెట్లో)

హర్షణీయం



ఈ పురాతన దేవాలయానికి రోడ్డు ఏర్పాటు చేయడం హర్షితగ్గ విషయం. గత పాలకులు ఇచ్చిన మాట నిలుపుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే, మాజీ మంత్రి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం శుభపరిణామం. రోడ్డు వేస్తే బుక్కపట్నం, పుట్టపర్తి పరిసర గ్రామస్థులు ఆ ఆలయంలో వివాహ, శుభకార్యక్రమాలు నిర్వహించే అవకాశముంది.

- కెంపరాజు రాజశేఖర్ గౌడ్

రద్దీ పెరుగుతుంది



వరగిరి వెంకటేశ్వరస్వామి ఆలయానికి రోడ్డు సరిగా లేకపోవడంతో భక్తులు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణం పూర్తి అయితే భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. అలాగే ఆలయం కూడా అభివృద్ధి చెందుతుంది. రహదారి నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే, మాజీ మంత్రికి కృతజ్ఞతలు.

- చింతా మల్లిరెడ్డి

ఆదమరిస్తే.. అంతే!

ప్రధాన రహదారులు సైతం గుంతలమయం

వర్షపునీరు నిల్వతో పెరిగిన ప్రమాదాలు



కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై గుంతలు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక హోండా షారూం ఎదురుగా... కదిరి - హిందూపురం ప్రధాన రహదారి దుస్థితి ఇది. గ్రామీణ రహదారులే కాదు... ప్రధాన రహదారులపై సైతం ఇలా విపరీతంగా గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో ఆ గుంతల్లో నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఆ గుంత లోతు తెలీక అనేక మంది ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పొరపాటున ఆదమరిస్తే.. కిందపడి.. ఆస్పత్రుల పాలవుతున్నారు. స్థానిక వైఎస్‌ఆర్ సర్కిల్‌లో కూడా వర్షం నీరు నిల్వ ఉంటోంది.

వైఎస్‌ఆర్ సర్కిల్‌లో నిలువ ఉన్న వర్షపు నీరు



గొర్రెల అపహరణ కేసులో నలుగురి అరెస్టు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : తాగుడుకు బానిసై గొర్రెలను అపహరిస్తున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో మనిగే రంగయ్య నాయుడికి చెందిన గొర్రెలు ఈనెల 12న అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. దీనిపై కేసు నమోదైంది. మంగళవారం ఉదయం కదిరి, హిందూపురం ప్రధాన రహదారి వణుకువారిపల్లి వద్ద ఎస్ఐ, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఆటోలో గొర్రెలను తరలిస్తున్నవారిని గుర్తించారు. గొర్రెలకు సంబంధించి వివరాలు అడుగ్గా... అందులోని వ్యక్తులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. మిట్టపల్లిలో గొర్రెలను వీరే చోరీ చేసినట్లు పసిగట్టారు. వారి నుంచి పది గొర్రెలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు వీరే...

ప్రకాశం జిల్లా బాపట్లకు చెందిన బండి శశికుమార్ మిట్టపల్లిలో పెళ్లి చేసుకున్నాడు. మిట్టపల్లికి చెందిన పులి వరప్రసాద్‌తో అతనికి పరిచయం ఏర్పడింది. శశికుమార్ ద్వారా బాపట్లకు చెందిన వెంకటేశ్వర్లు, చీరాలకు చెందిన కోనేటి బాలరాజుతో కూడా వరప్రసాద్ పరిచయాలు ఏర్పడ్డాయి. వీరంతా తాగుడుకు బానిసలు. డబ్బుల కోసం చోరీలకు పాల్పడేవారు. అందులో భాగంగా వీరు గొర్రెలను కూడా అపహరించేవారు. అలా వీరు మిట్టపల్లిలో గొర్రెలను చోరీ చేశారు. శశికుమార్, వెంకటేశ్వర్లపై బాపట్లలో కూడా చోరీ కేసులున్నాయి. సమావేశంలో ఎస్ఐలు మల్లికార్జున రెడ్డి, వెంకటనారాయణ, ఏఎస్ఐలు రమణారెడ్డి, కిషోర్‌రెడ్డి, జమేదార్ వెంకటేష్, పోలీస్ సిబ్బంది బాబ్‌జాన్, ప్రతాప్ పాల్గొన్నారు.

వయోజన విద్యపై సమీక్ష

పుట్టపర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వయోజన విద్య అభివృద్ధిపై విద్య, వివిధ శాఖల అధికారులతో గూగుల్‌మీట్ ద్వారా కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. 15 సంవత్సరాలు నిండిన వారందరినీ అక్షరాశ్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మూడు సంవత్సరాలు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థలు సామాజిక కార్యకర్తలు భాగస్వాములు కావాలని కోరారు.

సంక్షేమ పథకాలపై..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కలెక్టరేట్లో పలు శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 467 గ్రామపంచాయతీల్లో జనవరి 15, 2025 వరకు పలు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి ప్రమాద బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, యోజనాపథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం రమణకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, పశుసంవర్థక శాఖ జేడీ శుబదాసు పాల్గొన్నారు.

రేప్ కేసును ఛేదించిన పోలీసులకు అభినందన

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సామూహిక అత్యాచారం కేసులో నిందితులను వెంటనే పట్టుకోవడంలో చొరవ చూపిన సిబ్బందిని జిల్లా ఎస్పీ రత్న అభినందించారు. ఘటన జరిగిన 12 గంటలలోపే నిందితులను గుర్తించి 48 గంటల్లో వారిని అరెస్టు చేసిన ఎస్పీ సీఐలను, సిబ్బందిని అభినందించి వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సామూహిక అత్యాచార కేసులో నిందితులను సాంకేతికపరంగా వెనువెంటనే గుర్తించిన సీఐ ఆంజినేయులు, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌లను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా రెండు రాత్రుల్లో నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన సీఐలు కరీం, రాఘవన్, జనార్థన్, ఎస్.ఐ నరేంద్రలను అభినందించారు. వీరితో పాటు ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సిబ్బంది సునీల్‌నాయక్, నరేష్, రంగ, సత్యనారాయణ, పోతులయ్య, గంగరాజు, మహేష్, నాగార్జున జయరాం, ఎస్బీ కానిస్టేబుల్ సురేష్, జయరామ్, ఆదిశేషులను అభినందించారు.

సచివాలయ ఉద్యోగిపై అనుచిత వ్యాఖ్యలు

పరిగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వన్నంపల్లి గ్రామానికి చెందిన రమేష్ ఆ గ్రామ సచివాలయ సిబ్బందిని దుర్భాషలాడిన ఉదంతం ఇది. అతడు మంగళవారం పెన్షన్ దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వెళ్లాడు. అయితే సచివాలయ ఉద్యోగి పెన్షన్ సైట్ తెరుచుకోలేదని ఇప్పుడు దరఖాస్తు చేసుకోవడానికి వీలుపడదని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన రమేష్ కార్యాలయ సిబ్బందిని దుర్భాషలాడాడు. కార్యాలయాన్ని ధ్వంసం చేస్తానంటూ బెదిరించాడు. ఈ విషయంపై ఎస్ఐ రంగడు యాదవ్‌ను వివరణ కోరగా సచివాలయ ఉద్యోగుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనుకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని వెంకటాపురం గ్రామంలో మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్‌కు కదిరి బాలిక



తేజశ్విని

కదిరి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా నివాసముంటున్న నరసింహాచారి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె తేజశ్విని అండర్ 15 రాష్ట్ర స్థాయి క్రికెట్ ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. తేజశ్వణి స్థానిక సాధన పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇటీవల నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగిన రాష్ట్ర ప్రాబబుల్స్ టోర్నమెంటులో అత్యధిక వికెట్లు సాధించి, మెయిన్ ప్రాబబుల్స్‌కు ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. ఈనెల 18 నుంచి విజయనగరంలో జరగనున్న రాష్ట్రస్థాయి మెయిన్ ప్రాబబుల్స్ పోటీల్లో తేజశ్విని పాల్గొననుంది.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ధర్మవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న నాగేంద్ర, మల్లికార్జున ఇటీవల మరణించారు. దీంతో నాగేంద్ర కుటుంబానికి రూ.39,600, మల్లికార్జున కుటుంబానికి రూ. 35,600ను సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. తోటి కార్మికులు ఈ ఆర్థిక సాయం అందించినట్లు సీఐటీ యూ నాయకులు తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి ప్రభుత్వం తరపున ఆ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాబు పారిశుధ్య కార్మిక సం ఘం పట్టణ అధ్యక్షుడు ముకుంద, నాయకులు లక్ష్మీ ఓబి లేసు, పుల్లన్న, చెన్నకేశవ, పెద్దక్క పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

సబ్ జైలు తనిఖీ

ధర్మవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయసేవా అధికార సంస్థ పరిశీలించారు. ఖైదీలతో సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి, న్యాయవాది నూర్‌మహమ్మద్ పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న శివప్రసాద్‌యాదవ్

అభివృద్ధి పనులకు శ్రీకారం

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా కూటమి నాయకులు, అధికారులు పలు అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారంచుట్టారు. నియోజకవర్గంలో రూ.1.20 కోట్లతో పలు గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, శ్రీరాంనాయక్, బొమ్మయ్య, శ్రీరామిరెడ్డి, పుల్లప్ప, నాగరాజు, మహేష్, మురళి, కృష్ణారెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి భూమిపూజ చేశారు. ఇందులో ఎంపీడీఓ వెంకటరంగారావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.
- ముదిగుబ్బ: మండలంలోని చిన్నకోట్ల, భూదనాంపల్లి, మర్తాడు, కొడవండ్లపల్లి, దొరిగల్లు గ్రామాల్లో సీసీరోడ్లకు, పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఇందులో ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ దివాకర్ పాల్గొన్నారు.
- నల్లచెరువు : మండలంలోని మలకవారిపల్లి, సామచేనుబైలులో పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాలను అధికారులు నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా, సర్పంచ్ సావిత్రమ్మ, ఏఓ రామక్రిష్ణ, విస్తరణాధికారి శకుంతల, కార్యదర్శులు ఆనంద్, నరసింహులు, ఈసీ బాలునాయక్ పాల్గొన్నారు.
- గాండ్లపెంట: మండలంలోని జీన్లకుంట, గాండ్లపెంటలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, ఈఓఆర్డీ సునీత, పంచాయతీరాజ్ జేఈ రెడ్డివరప్రసాద్, ఉపాధి ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, కార్యదర్శి బాషా, మాజీ సింగల్ విండో డైరెక్టర్ వెంకటరమణరెడ్డి, సర్పంచ్ రహంతుల్లా పాల్గొన్నారు.
- కదిరి అర్బన్ : మండలంలోని కాళసముద్రం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, ఏపీఓ శ్రీధర్, ఏపీఎం శారద, టీడీపీ నాయకులు చెన్నకేశవులు, ఉపేంద్రరెడ్డి, హరి, అంజి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.



పెడపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఈ-పంట నమోదులో తప్పులుంటే అర్జీలు ఇవ్వండి

అనంతపురం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ పంట నమోదులో తప్పిదాలుంటే అర్జీలు ఇవ్వాలని ఏఓ శశికళ సూచించారు.. మండలంలోని కామరుపల్లి, చిన్నంపల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, వేరుశనగ పంటలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. చిన్నపల్లి సర్పంచు శివశంకర్, ఏఈఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

జిల్లాలో బుధవారం నుంచి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేయనున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 27 లక్షలకుపైగా గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు. బుధవారం నుంచి నెలాఖరు దాకా మందును వేస్తామన్నారు.

ముగిసిన దస్తగిరిస్వామి ఉరుసు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్‌లోని మాబునుబహాని దర్గాలో షాహే గౌసే ఆజం ఆసార్ కమిటీ ఆధ్వర్యంలో 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఉరుసు ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఉదయం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు దర్గాలో ఏర్పాటుచేసిన దస్తగిరిస్వామి పవిత్రకేశాన్ని కులమతాలకు అతీతంగా భక్తులు దర్శించుకున్నారు. రాత్రికి అన్నదానం చేశారు.

ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన కలాం

● మంత్రి సవిత


కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి

పెనుకొండ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం, ప్రజల బాగుకోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి, మిస్సైల్‌మ్యాన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆజాద్ అంటూ రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత కొనియాడారు. అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు కలాం అని కొనియాడారు. కలలు కని, వాటిని సాకారం చేసుకోవాలని యువతకు ఆయన చెప్పిన మాటలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, మాధవనాయుడు, చిన్నవెంకటరాముడు, కన్వీనర్ శ్రీరాములు, సిద్దయ్య, మైనార్టీ నాయకుడు దాదు, షౌకత్, రఘువీరచౌదరి, చంద్రకాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

పెనుకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి మిస్సైల్‌మెన్ అబ్దుల్ కలాం జయంతి వేడుకలను పట్టణంలోని కళాశాలల్లో, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపకుడు హైకోర్టు న్యాయవాది రామక్రిష్ణ ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. దేశ అభివృద్ధికి కలాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వెంకటేశ్, బాబుప్రసాద్, లక్ష్మీనారాయణ, రవికుమార్, ఈశ్వర్, రామాంజినేయులు, శెట్టిపల్లి నరసింహులు, ఆండ్రోస్, మారుతి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డా. జయప్ప ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా అధ్యాపకులు, విద్యార్థులు కలాం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రతాప్, హరీష్‌బాబు, రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.


నివాళులు అర్పిస్తున్న బహుజన చైతన్యవేదిక సభ్యులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అధికారులు

సోమందేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని నడింపల్లి కేతగానిచెరువు గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధికారులు శంకుస్థాపన చేశారు. మంగళవారం నడింపల్లిగ్రామంలో రెండు రోడ్లకు రూ.6లక్షలు కేతగానిచెరువులో రెండురోడ్లకుగాను రూ.16లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుట్టూరు, వెంకటగిరిపాళ్యంలో..

పెనుకొండ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుట్టూరు, వెంకటగిరిపాళ్యంలో పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించినట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. గుట్టూరులో రూ.15లక్షలతో డ్రైన్లు, సీసీరోడ్లు, వెంకటగిరిపాళ్యంలో రూ.30లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ చేసినట్లు వారుతెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరీ, వీజీపాళ్యం శీన తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై అనుచిత వ్యాఖ్యలు

పరిగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : వన్నంపల్లి గ్రామానికి చెందిన రమేష్ ఆ గ్రామ సచివాలయ సిబ్బందిని దుర్భాషలాడిన ఉదంతం ఇది. అతడు మంగళవారం పెన్షన్ దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వెళ్లాడు. అయితే సచివాలయ ఉద్యోగి పెన్షన్ సైట్ తెరుచుకోలేదని ఇప్పుడు దరఖాస్తు చేసుకోవడానికి వీలుపడదని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన రమేష్ కార్యాలయ సిబ్బందిని దుర్భాషలాడాడు. కార్యాలయాన్ని ధ్వంసం చేస్తానంటూ బెదిరించాడు. ఈ విషయంపై ఎస్ఐ రంగడు యాదవ్‌ను వివరణ కోరగా సచివాలయ ఉద్యోగుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

పరిగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిగెనహళ్లిలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు 20మందికి నిత్యవసర సరుకులను బీజేపీ మండల అధ్యక్షుడు బంగారు చంద్ర పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనచుట్టూ ఉన్నపరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎల్లవేళలా శ్రమించే కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, బజరంగదల్ నవీన్, విట్టాపల్లి నాగరాజు, జయరామప్ప, నీలకంఠరెడ్డి, సంజీవ, బాబుప్రసాద్, ధృవ, సాయి, చంద్ర, మహేష్, తదితరులు ఉన్నారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెనుకొండ, అక్టోబరు 15 : పట్టణ సమీపంలోని వెంకటాపురం గ్రామంలో మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుట్టూరులో ఘనంగా చౌడమ్మ ఉత్సవం

మండలంలోని గుట్టూరులో చౌడమ్మ జ్యోతుల ఉత్సవం నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా సోమందేపల్లి నుంచి తొగటవీరక్షత్రియసంఘం సభ్యులు అమ్మవారిని ఊరేగింపుగా జ్యోతులతో గుట్టూరుకు తీసుకువచ్చి నృత్యం చేశారు. జ్యోతుల ఉత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ఆసక్తిగా తిలకించారు.

మలుపు వద్ద బోర్డుల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరిగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నేతులపల్లి గ్రామసమీపంలో శిర హైవే మలుపు వద్ద ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు స్పందించి బోర్డులను తొలగించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రమాదాల మలుపు అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు కంపెనీ ప్రతినిధులతో బోర్డులను తొలగింపజేశారు. దీంతో ప్రయాణికులు, గ్రామప్రజలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి


అవగాహనకల్పిస్తున్న ఎస్ఐ నరేంద్ర

పెనుకొండ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా సీటుబెల్ట్ హెల్మెట్ ధరించాలని రొద్దం ఎస్ఐ నరేంద్ర సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం రొద్దం మండలంలోని పెద్దమంతూరు, రొప్పాల గ్రామంలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్, సీటుబెల్ట్ ధరించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని సూచించారు.

ఆంజనేయస్వామి ఆలయానికి రూ.50వేల విరాళం


విరాళం అందజేస్తున్న సురేష్‌రెడ్డి

గోరంట్ల, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులేరు పంచాయతీ మరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి సురేష్‌రెడ్డి రూ.50వేలు విరాళాన్ని మంగళవారం అందించారు. పులేరు గ్రామానికి చెందిన సురేష్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు విరాళం అందించారు. దాతకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రావికుంట చెరువులో పడి వృద్ధురాలి మృతి

గోరంట్ల, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెడ్డివారి వీధికి చెందిన మతిస్థిమితం లేని చర్మల బీబీజాన్(83) రావికుంట చెరువులో పడి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. పోలీసులు సమాచారం మేరకు బీబీజాన్ తరచూ ఇంటినుంచి వెళ్లటం, తరువాత కుటుంబ సభ్యులు తీసుకురావడం జరిగేది. ఈనెల 8న ఆమె బెంగుళూరుకు వెళ్లగా, ఆమె చేతి బ్యాగ్‌లోని ఫోన్ నెంబర్‌ద్వారా కుటుంబ సభ్యులు తీసుకువచ్చారన్నారు. అలాగే 10నుంచి ఆమె కనిపించకపోగా, మంగళవారం మండలకేంద్రానికి సమీపంలోని రావికుంట చెరువులో శవమై కనిపించింది. ప్రజల ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాబు సంఘటనాస్థలాన్ని పరిశీలించి, శవాన్ని బయటకు తీశారు. మృతురాలి మనవడు షేక్ అన్సర్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు.

సొంత ప్రయోగాలు వద్దు

● వర్షంలో విద్యుత్‌తో జాగ్రత్త
● నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం
● ప్రజలకు విద్యుత్ శాఖ అధికారుల హెచ్చరిక



చిలమత్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లేనిదే ఏ పని జరగదు..అయితే దాని పట్ల అజాగ్రత్తగా ఉంటే మాత్రం ప్రాణాలు గాల్లోకి కలిసిపోవడం ఖాయం. ప్రధానంగా ఇప్పుడు వర్షాకాలం కావడంతో విద్యుత్ ప్రమాదాలు కూడా ఎక్కువగా జరిగేందుకు అవకాశాలు ఉంటాయి. వ్యవసాయ పొలాల్లో బోరు మోటార్ల నుంచి గ్రామాల్లో వేలాడే విద్యుత్ తీగలు, వర్షాలకు గోడలకు నెమ్మెక్కి విద్యుత్ సరఫరా కావడం తదితర విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఏ మాత్రం అనుభవం లేకుండా రైతులు తమ మోటార్ల రిపేరీకి చొరవ చూపుతుంటారు. దీని వల్ల విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం లేకపోలేదు. ఫ్యూజులు మార్చడం వంటివి సొంతంగా చేసుకోకూడదని విద్యుత్ అధికారులతోనే వాటిని మార్చుకోవాల్సి ఉంది. అదేవిధంగా రేకుల ఇళ్లకు విద్యుత్ తీగలు తగల కుండా చూసుకోవాలి. ఇంటికి ఎర్తింగ్ తప్పని సరిగా ఉండే విధంగా చూసుకోవాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యం సరికాదు

ఈ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. సెల్‌ఫోన్‌ని చార్జింగ్‌లో పెట్టి మాట్లాడుతుంటారు. అలా చేయడం వలన ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. గ్రామాల్లో అక్కడక్కడ ఇనుప విద్యుత్ స్థంబాలు ఉంటాయి. వాటిని తాకడం మంచిది కాదు. అదేవిధంగా ఒక స్తంభం నుంచి మరో స్తంభానికి తాడు కట్టి బట్టలు ఆరేయడం వంటివి చేయరాదు. అనుకోకుండా ఇనుప స్థంభాలకు విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలు జరగవచ్చు. ఎక్కడైనా కర్రలకు విద్యుత్ తీగలను కట్టి ఉంటే వాటికి దూరంగా ఉండాలి. పిల్లలను వాటి దరికి పోనీయరాదు.

జాగ్రత్తలు తప్పనిసరి

వర్షాకాలంలో బలమైన గాలులు వీయడం వలన ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. దీంతో రైతులు చిన్న చిన్న మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. అలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. వాటి మరమ్మతులు విద్యుత్ సిబ్బందితోనే చేయించాలి.

విద్యుత్ మోటార్లకు ఎర్తింగ్ తప్పనిసరి

ప్రతి ఒక్కరు ఇళ్లకు ఎర్తింగ్ తప్పక ఏర్పాటుచేసుకోవాలి. వర్షం పడితే విద్యుత్ స్విచ్‌లు తడవకుండా చూసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్ బాక్సులు చుట్టూ పిచ్చి మొక్కలను ఉండకుండా చూసుకోవాలి. తెగిన విద్యుత్ తీగలను తాకరాదు. వాటి చుట్టూ విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకునే వరకు ప్రమాద సూచికలు ఏర్పాటుచేయాలి. ప్రధానంగా అటువంటి చోట్లకు పశువులు, చిన్న పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తపడాలి. వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగేందుకు అవకాశాలు ఉంటాయి. ఈ సమయంలో సొంతంగా మరమ్మతులు వద్దని విద్యుత్ అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. వర్షాకాలంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే వాటిని గుర్తించి ఆ పరిసరాలకు దూరంగా ఉండాలి. తడి చేతులతో స్విచ్‌లు ఆన్ చేయడం కానీ, ఆఫ్ చేయడం కాని చేయరాదు.

రేప్ కేసును ఛేదించిన పోలీసులకు అభినందన


సీఐ ఆంజనేయులుకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సామూహిక అత్యాచారం కేసులో నిందితులను వెంటనే పట్టుకోవడంలో చొరవ చూపిన సిబ్బందిని జిల్లా ఎస్పీ రత్న అభినందించారు. ఘటన జరిగిన 12 గంటలలోపే నిందితులను గుర్తించి 48 గంటల్లో వారిని అరెస్టు చేసిన ఎస్పీ సీఐలను, సిబ్బందిని అభినందించి వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సామూహిక అత్యాచార కేసులో నిందితులను సాంకేతికపరంగా వెనువెంటనే గుర్తించిన సీఐ ఆంజినేయులు, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌లను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా రెండు రాత్రుల్లో నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన సీఐలు కరీం, రాఘవన్, జనార్దన్, ఎస్.ఐ నరేంద్రలను అభినందించారు. వీరితో పాటు ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సిబ్బంది సునీల్‌నాయక్, నరేష్, రంగ, సత్యనారాయణ, పోతులయ్య, గంగరాజు, మహేష్, నాగార్జున జయరాం, ఎస్‌బీ కానిస్టేబుల్ సురేష్, జయరామ్, ఆదిశేషులను అభినందించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి: రుఖియా బేగం

హిందూపురం అర్బన్, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 15: ఇద్దరు మహిళలపైన అఘాయిత్యానికి పాల్పడిన దోషులను కఠినాతి కఠినంగా శిక్షంచాలని రాష్ట్ర ఉమెన్స్ ప్రొటెక్షన్ కమిషన్ మెంబర్, సత్యసాయి జిల్లా ఇన్‌చార్జి షేక్ రుఖియా బేగం పేర్కొన్నారు. ఘటన విషయం తెలుసుకున్న ఆమె మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి అక్కడ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాయకష్టం చేసి కాస్త డబ్బు సంపాధించి ఆడబిడ్డకు పెళ్ళి చేయాలనే విషయంపై కర్నాటక నుంచి హిందూపురం వచ్చారని తెలిసిందన్నారు. కనీసం వారికి ఒంటిపైన గుడ్డలు కూడా సరిగాలేవని అంత అమాయకపు బతుకుపై మృగాలు దాడి చేసి అఘాయిత్యానికి పాల్పడటం నీచాతి నచమన్నారు. ఇలాంటి నీచులకు సభ్యసమాజంలో చోటు ఇవ్వకూడదన్నారు. ఇంటి పరిసరాల్లో వారు ఎవరు మాట్లాడకూడదని, అంగళ్ళలో సరుకులు కూడా ఇవ్వకూడదని ఆవేదన చెందారు. ఇలాంటి నిందుతులకు కఠిన చట్టాలు తీసుకురావాలని సీఎం చంద్రబాబుకు కూడా విన్నవిస్తామన్నారు. దోషులకు ఎవరూ బెయిల్ కూడా ఇప్పిచకూడదన్నారు. ఇంకొక సారి మహిళల పట్ల అసభ్యంగా వ్యహరించాలంటేనే భయపడేలా చట్టాలను తీసుకొచ్చి కఠినంగా శిక్షలు విధించాలని ఆగ్రహించారు. ఘటన జరిగిన వెంటనే నిందితులను పట్టుకోవడంలో పోలీసుల పనితీరు బేషుగ్గా ఉందన్నారు. బాధితులకు ఏపి ఎమెన్స్ ప్రొటెక్షన్ అండగా ఉంటుందని, ప్రభుత్వం తరుపున వారికి అన్ని విధాలా అండదండలు అందేలా చూస్తామన్నారు. బాధితులకు న్యాయం జరుగకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆమె వెంట ఐసిడిఎస్ పిడి నాగమల్లీశ్వరీ,టూటౌన్ సీఐ కరీంభాష, ఓఎస్‌సీ బృందం సభ్యులు, సిడిపిఓ రెడ్డిరమణమ్మ ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాలను మెరుగు పరచడమే కియ ధ్యేయం


విద్యార్థులతో మాట్లాడుతున్న హుందయ్ స్టీల్ యాజమాన్యం

పెనుకొండ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటి కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలను మెరుగు పరచడమే ధ్యేయంగా కియా ఇండియా పనిచేస్తుందని హుండాయ్ స్టీల్ యాజమాన్యం మేనేజర్ జామెన్‌కిమ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చంద్రగిరి గ్రామంలో హుండాయ్ స్టీల్ యాజమాన్యం సౌజన్యంతో గ్రామంలో సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, స్కూల్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చక్కభజన, కోలాటం ఆటలు విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం హుండాయ్ స్టీల్ కమిటీ యాజమాన్యం పాఠశాల మౌళిక వసతులపై హెచ్ఎం మధుతో అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి పాఠశాల భవనం, కాంపౌండ్, మరుగుదొడ్లు వసతులులేవని హుండాయ్ యాజమాన్యంకు వివరించారు. పాఠశాల భవనం, మరుగుదొడ్లు నిర్మిస్తామని యాజమాన్యం ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం కొరియర్ విద్యార్థులు పాఠశాల భవనానికి రంగులు వేశారు. ఈ కార్యక్రమంలో హుండాయ్ స్టీల్ యాజమాన్యం, పోతిరెడ్డి, ఉపాధ్యాయులు బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

అమరాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని ఆలదపల్లి, కె.శివరం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సీసీ రోడ్లు, ఫారంపాండ్స్, డగౌట్‌పాండ్స్, ఫర్కులేషన్‌పాండ్స్, బౌండ్రీట్రంచులు, కందకాలు, ఫీడర్‌ఛానళ్లు తదితర పనులను ఉపాధి హామీ పథకంలో వీటికి అనుసంధానం చేయడం జరిగింది. గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 13326 గ్రామసభలను ఒకే రోజే నిర్వహించడం ఒక చారిత్రాత్మక నాంది అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ఏపీఓ జగదీష్, మండల కన్వీనర్ గణేష్, సర్పంచులు చిత్తప్ప, ఈరన్న, టెక్నికల్ అసిస్టెంట్‌లు మంజునాథ్, హెన్రీ అరుణ్‌కుమార్, మాజీ సర్పంచులు పాండురంగప్ప, ఈరన్న, సీనియర్ నాయకుడు గుజ్జారప్ప, క్లష్టర్ ఇన్‌చార్జి ప్రభు, రమేష్, మాజీ ఎంపీటీసీలు, మాజీ డీలర్లు, ప్రస్తుత డీలర్లు, క్లష్టర్ ఇన్‌ఛార్జులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ముద్దరాజు, గిరీష్, మంజునాథ్, స్థానిక నాయకులు, ఉపాధిహామీ కూలీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

మడకశిర రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : టీడీపీతోనే గ్రామాలు బాగా అభివృద్ధిచెందుతాయని మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ,క్లష్టర్ ఇన్‌చార్జీనాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్ అనంతపురం, ఛత్రం పంచాయితీలలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రెండు పంచాయితీల్లోని గ్రామాల్లో సీపీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్,మండల ఇంజనీయర్ నాగన్న,ష్యాకూర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి


కిట్లు పంపిణీ చేస్తున్న జపానందస్వామి

పావగడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజసేవలో భాగంగా తోటివారికి సహాయపడాలన్న మంచి ఆలోచనతో బెంగళూరు ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో పావగడ రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి చేస్తున్న సేవలు గర్వించదగ్గవని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజయవాడలో తెలియజేశారు. సోమ మంగళవారాల్లో విజయవాడలోని పశ్చిమ నియోజకవర్గంలోని వరద బాధితులకు జపానందస్వామి రెండోదఫా నిత్యావసరాల సరుకుల కుట్లను పంపిణీ చేస్తూ రామకృష్ణ సేవాశ్రమ సేవలను ఆయన కొనియాడారు. ఒకటిన్నర నెల క్రితం వరద ప్రవాహానికి గురైన విజయవాడ ప్రాంతాన్ని ఆదుకోవడానికి మానవదృష్టితో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈప్రాంతానికి వరదలు రావడం బాధాకరంగా ఉందని స్వామి పేర్కొన్నారు. నాలుగువేల కుటుంబాలకు నిత్యావసరాల సరుకులు వస్త్రాలు, బాధితులకు స్వామిజీ చేతుల మీదుగా అందజేశారు. జపానందస్వామి అందిస్తున్న సేవలు నేడు ఆంధ్రప్రదేశ్‌కు దొరకడం విజయవాడ పుణ్యం అని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సృజనా చౌదరి తెలియజేశారు. తుమకూరు నుండి ప్రజాప్రగతి పత్రిక సంస్థాపకులు నాగన్న, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, విజయవాడలోని బీజేపీ జిల్లా అధ్యక్షులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పల్లెపండుగ సందర్భంగా సీసీ రోడ్ల పనుల గుర్తింపు


సీసీ రోడ్లు వేయడానికి స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ నాయకులు

రొళ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనిసేకుంట గ్రామంలో సీసీ రోడ్లు వేయించడానికి స్థల పరిశీలన చేశారు. మంగళవారం టీడీపీ నాయకులు కలిసి బురదగా ఉన్న రోడ్డును పరిశీలించారు. దీనిని పల్లె పండుగ కార్యక్రమంలో సీసీ రోడ్లు వేసేందుకు భూమిపూజ చేస్తారని తెలియజేశారు. గత ప్రభుత్వంలో ఏనాడు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేయలేదని వాపోయారు. గాంధీతాత కలలు నెరవేరడానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడానికి ముదంజలో ఉందన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టప్ప, యూనిట్ ఇన్‌చార్జి ఉగ్రేగౌడ్, బూత్‌కన్వీనర్ నారాయణప్ప, పంచాయతీ అధ్యక్షులు రామచంద్రప్ప, సీనియర్ నాయకులు ముడుపేగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన విద్యుత్ ప్రమాదం


విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందిన కుక్క

మడకశిర రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లి బీసీ కాలనీ మధ్యలో 11 కేవీ విద్యుత్ వైర్లు తెగి క్రింద పడ్డాయి. ఉదయం వర్షం వస్తుండడంతో కాలనీ వాసులు ఎవ్వరూ ఇళ్లనుంచి బయటికి రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాలనీలో కుక్క అటువేపు వెళ్తూ తెగిపడిన విద్యుత్ వైరు తగలడంతో కుక్క అక్కడిక్కడే మృతిచెందింది. ఈ విషయం గమనించిన కాలనీ వాసులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం మరమ్మతులు చేపట్టారు.

తహసీల్దార్‌ను నియమించండి

గుడిబండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుడిబండ తహసీల్దార్ కార్యాలయానికి తహసీల్దార్‌ను నియమించాలని మండల రైతులు కోరారు. గత నెల రోజుల నుండి తహసీల్దార్ లేకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి రైతులు వన్‌బీలు, పాసుపుస్తకాలు, విద్యార్థులకు కులధ్రువీకరణ పత్రాలు ఆదాయ సర్టిఫికెట్లు, తదితర పనుల కోసం వచ్చి వెళుతున్నామని రైతులు వాపోతున్నారు. రెగ్యులర్ తహసీల్దార్ లేక తీవ్ర అవస్థలు పడాల్సి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌కే పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

మడకశిరలో భారీ వర్షం

మడకశిరటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మడకశిరలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి 5.30 గంటల వరకు వర్షం కురిసింది. గత రెండు రోజుల నుండి తుపాను కారణంగా ఓమోస్తారు వర్షం కురుస్తుండటంతో రైతులు వేరుశనగను తొలగించుకొన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుండి నియోజకవర్గం వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. తెల్లవారుజాము నుండి ఉదయం 11 గంటల వరకు కురిసి అనంతరం సాయంత్రం 5 గంటల వరకు ఆగింది. తిరిగి 5 గంటల నుండి అర గంటపాటు వర్షం కురిసి అనంతరం చిరుజల్లులు కురుస్తోంది. వర్షం కురుస్తుండటంతో చిన్న చిన్న కుంటలు, చెక్‌డ్యాంలు నిండటంతో పాటు చెరువులకు సైతం నీరు చేరుతోంది.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ రంగనాథుడు

అగళి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అగళి మండలంలోని నరసాంబుది గ్రామంలో గత తొమ్మిది రోజులుగా జరిగిన నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. అత్యంత వైభవంగా రంగనాథ స్వామి ఉత్సవాలు గ్రామస్థులు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు రంగనాథ్ స్వామికి వివిధ పూజలు రథోత్సవంపై స్వామివారి ఊరేగింపు, మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

రూ. కోటితో రోడ్ల మరమ్మతులు


గుంతలమయంగా మధుగిరి రోడ్డు

మడకశిర, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గత మూడు సంవత్సరాలుగా దెబ్బతిన్న రోడ్లు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టక తాత్కాలిక మరమ్మతులు చేపడుతుండడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ రహదారులు మరింత దెబ్బతిని గుంతల మయం అవుతున్నాయి .

రూ. కోటితో దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు : జగదీష్‌గుప్త,

మడకశిర సబ్‌డివిజన్ పరిధిలోని దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు కోటి రూపాయిల నిధులు మంజూరు అయినాయి . ఈ నిధులతో . దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపడతాం. ఇందుకు సంబందించి టెండర్లు కూడా పిలవడం జరిగింది. త్వరలోనే దెబ్బతిన్న రోడ్ల ను మరమ్మతులు చేపడతాం.